MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 21 సంచిక: 1 రంగారెడ్డి సెప్టెంబర్ 2022 పేజీలు : 36 వెల : రూ. 10/-


## ఝండా ఊంచా రహే హమారా !






ఏపిమాస్ డైరెక్టర్ శ్రీ శంభుప్రసాద్ పీలేరు ఎఫ్ డి సి సందర్శన



జి హెచ్ ఎం సి లో శిక్షణల హెూరు !

## దక్షిణాది సహకార సంస్థల పరిస్థితి పై చర్చాగోష్ఠి !




జ్యోతి ప్రజ్వలన: శ్రీ జయప్రకాశ్ నారాయణ్



స్వాగతోపన్యాసం: శ్రీ సి ఎస్ రెడ్డి

## అడవికి కొత్త ఊపిరి!



కురబలకోట మండలంలో విత్తనబంతుల విలాసం


## బీహార్‌లో నూతనోత్తేజం!



ఏపిమాస్ నిర్వహణలోని 11 ఎఫ్ పి ఓలతో 'డి హ్యాట్' వ్యాపారాభివృద్ధి ఒప్పందం


PRAGATI OFFSET ప్రగతి ఆఫ్‌సెట్

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
బహిరంగంగా బహిర్భూమికి వెళ్ళడం సరికాదు
మీ ఇంటి లోపల మరుగుదొడ్డి నిర్మాణం మంచి పరిష్కారం
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత


సంపుటి 21 సంచిక 1



సంపాదకీయం

## ఉభయ తారకం !

ప్రపంచం వివిధ రంగాలలో సాధిస్తున్న అభివృద్ధి, పురోగతి ఇటు ఆనందాన్ని, అటు అశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎంతలో ఎన్ని మార్పులు, నవీకరణలు, వినూత్న సృజనలు ! నిన్నటికి నేటికే ఎంతో అంతరం! మొన్నమొన్నటి వరకు భవిష్యత్తులో ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారుతుందంటే ఏమిటో అర్ధమయ్యేది కాదు. కాని, ఇప్పుడు ... వైజ్ఞానిక , సాంకేతిక, సమాచార విప్లవంతో ప్రపంచం ఒక కుగ్రామమేమిటి, కేవలం చేతిలో యిమిడిపోతుంటే అమితాశ్చర్యంగా, ఆనందంగా వుంటుంది కదా! కాని,యింతటి ఆనందోత్సాహంలో కూడా మరోవైపు తీరని వెలితి. ఒకవైపు కేవలం కొందరి వద్దనే కుప్పతెప్పలుగా సంపద పోగుపడుతుంటే, యింకోవైపు యిప్పటికీ ఎందరి బతుకులలోనో కటిక దారిద్ర్యం తిష్ఠవేసుకుని వుంటున్నది. పేదరికం మానవ వికాసాన్ని కుంగదీస్తుంది. అందుకే పేదరిక నిర్మూలనను నాగరిక సమాజం తన ప్రథమ కర్తవ్యంగా భావిస్తుంది. ఆ కారణంగానే పేదరిక నిర్మూలనకు కృషి కొనసాగుతూనే వుంటుంది. ఐతే విషాదం ఏమిటంటే అది అంతులేని కథగా మారడమే. పథకాలు, ప్రయోగాలు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించేవి మాత్రమే కావడమో, వాటి అమలులో చిత్తశుద్ధి లోపమో కారణం ఏదైనా , నిరుపేదరికం మనకు సవాలుగా మిగిలిపోతూనే వున్నది. ఈ స్థితిలో 20 వ శతాబ్దంలో ప్రపంచం ఒక చరిత్రాత్మకమైన, మహోన్నతమైన పేదరిక నిర్మూలన మహోద్యమాన్ని స్వాగతించి పొంగిపోయింది. అదే స్వయంసహాయ ఉద్యమం! ఆ ఉద్యమం ప్రపంచమంతటా ఉవ్వెత్తున ఎగసింది. ఆ మహోజ్వల ఘట్టం చరిత్రను తిరగరాస్తుందనే ఆశ బలపడింది. నిజంగానే స్వయంసహాయ ఉద్యమం ఎన్నో విజయాలను చవిచూసింది. కాని కారణాలు ఏవైనా, కారకులు ఎవరైనా ఆ మహోద్యమాన్నికూడా స్తబ్ధత ఆవరించింది. మరింత బాధాకరమైన విషయం ఏమిటంటే ఆత్మగౌరవ ప్రదమైన ఏ స్వయంసహాయం ఈ ఉద్యమానికి ఊపిరులూదిందో ఆ స్వయం సహాయ భావన మరుగునపడి పోయింది. మళ్ళీ వెలుపలి సహాయానికి అర్రులు చాచడం, లభించిన సహాయాన్ని జీవనోపాధుల మెరుగుదలకు కాకుండా సాధారణ ఖర్చులకు ఉపయోగించుకుని తిరిగి పేదరికంలోనే మిగిలిపోవడం కాదనలేని వాస్తవం. నేలవిడిచి సాము చేయాలనుకోవడం, అనవసరమైన ఆడంబరాలకు పోతూ సుస్థిరాభివృద్ధి ఆలోచనకు ప్రాధాన్యం యివ్వకపోవడం మరో విషాదం. ఇక యిప్పుడు ఇలాంటిదే మరో మహోజ్వల ఘట్టం మనకళ్ళ ఎదుట ఆవిష్కృతమవుతున్నది. అదే రైతుల బతుకులలో వెలుగులు నింపడానికి వచ్చిన ఎఫ్ పి ఓలు! ఈ ఉద్యమం కూడా మహోజ్వలంగా సాగుతున్నది. ప్రభుత్వాలు కూడా ఎఫ్ పి ఓల ఏర్పాటుకు, సవ్యనిర్వహణకు ఎంతో ప్రాధాన్యమిస్తూ, ఎఫ్ పి ఓలను బలోపేతం చేయడానికి అనేక విధాలుగా కృషి చేస్తున్నాయి. భవిష్యత్తులో రైతాంగానికి ఏ సహాయ సహకారాలు అందాలన్నా ఎఫ్ పి ఓల సభ్యత్వం ప్రధాన అర్హత అవుతుందనడంలో సందేహంలేదు. ఎఫ్ పి ఓల మూలబలం అవి వ్యాపారాత్మక సంస్థలుగా పనిచేయగలగడం. ఆ దిశగా ఎఫ్ పి ఓలు యిప్పుడిప్పుడే అడుగులు వేస్తున్నాయి. ఇది శుభ పరిణామం. ఈ రెండు ఉద్యమాలలోను కీలక పాత్ర పోషించిన, పోషిస్తున్న ఏపిమాస్ ఈ రెండు వ్యవస్థలమధ్య అనుసంధానానికి కృషిచేస్తున్నది. అభివృద్ధి రంగ నిపుణులలో పలువురు ఈ శుభ పరిణామాన్నే కోరుకుంటున్నారు. ఈ అనుసంధానం ప్రస్తుతం స్తబ్దంగా వున్న స్వయం సహాయ సంఘాలలో నూతనోత్తేజాన్ని ప్రేరేపించే అవకాశం వుంది. స్వయంసహాయ మహిళలలో అధిక శాతం మంది చిన్న రైతులో, రైతు కూలీలో వుంటారు. ఈ అనుసంధానంద్వారా వారు ఎఫ్ పి ఓలు అందించే ప్రయోజనాలను పొందగలుగుతారు. సభ్యుల సంఖ్య పెరిగి, మరింత ఆర్థిక స్తోమతతో ఎఫ్ పి ఓలు కూడా బలపడగలుగుతాయి. అంతిమంగా రైతులందరూ ఎఫ్ పి ఓలలో సభ్యులు కావాలనే అశయం నెరవేరడానికి యిది ఎంతైనా దోహదం చేస్తుంది. అయితే, ఈ అనుసంధానం కార్యరూపం దాల్చడానికి యింకా కొంత సమయం పట్టవచ్చు. ప్రభుత్వాలు కూడా ఉభయతారకమైన ఈ అనుసంధానాన్ని ప్రోత్సహించే చర్యలను చేపట్టడం అవసరం. రెండు వ్యవస్థలు తమ స్వయంప్రతిపత్తిని కొనసాగిస్తూనే ఉమ్మడిగా ప్రయోజనాలు పొందవచ్చు. అచిర కాలంలోనే ఈ అనుసంధానం సిద్ధిస్తుందని ఆశిద్దాం!



Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

**అయోమయంగా పరుగు పెట్టడం కంటె ఆత్మ విశ్వాసంతో ఒక్కో అడుగు వేసినా ఎంతో మేలే**

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....


- సహకార సంస్థలకు సంకెళ్ళా ?... తగదు ! ...05
- పంటలకు ఈ నెలలో తెగుళ్ళు ఎక్కువ ... ...07
- నాబార్డ్‌కు దయాకరరావు ప్రశంస ...09
- నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవం ...10
- చిత్తూరు జిల్లాలో ఎఫ్‌పిఓల తీరుపై సి ఎస్ సమీక్ష ...11
- ఏపిమాస్ ప్రముఖులచే పీలేరు ఎఫ్‌పిఓ సందర్శన ...13
- నిబంధనలకు నీరాజనం..మహాసభల సంరంభం...14
- వాష్ లోన్‌తో మరుగుదొడ్డి నిర్మాణం ...16
- వాష్ లోన్‌తో ఉమ్మడి బోర్ బావి ...17
- రిసోర్స్ పర్సన్స్‌కు 'వాష్' కార్యక్రమాలపై శిక్షణ ...18
- వ్యాపారవేత్త కావడానికి కుటుంబం అడ్డంకికాదు...19
- జిహెచ్ఎంసి ఆర్పీలకు ఏపిమాస్ శిక్షణ ...20
- రైతు సమృద్ధి కేంద్రాల సుస్థిరతకు వ్యూహాలు ...21
- భూసారాన్ని పెంపొందించే జీవన ఎరువులు ...23
- అధిక దిగుబడికి సమగ్ర సస్యరక్షణ చర్యలు ...26
- 'పాడిపంటలు' ప్రాజెక్ట్‌లో విత్తన బంతులు ...28
- అక్కడ ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తే జరిమానా ...29
- దానిమ్మలో చీడలు, తెగుళ్ళు...సమగ్ర సస్యరక్షణ...30
- అనేక విషయాలను నేర్పిన 'ఆదరణ' పర్యటన ...32
- ఏపిమాస్‌లో 75వ స్వాతంత్ర్య సంబరాలు ...34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**


మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

**సానుకూల వైఖరి అంటే కేవలం ఆశాభావమే కాదు, జరిగేదంతా మంచికే అనే వివేచన**

# సహకార సంస్థలకు సంకెళ్ళా ? ... తగదు !

## దక్షిణభారత సంస్థల స్వయం ప్రతిపత్తి, స్వాతంత్ర్యంపై ఏపిమాస్ నిర్వహణలో చర్చాగోష్ఠి

– మురళి జాజున, రాజశేఖర్









**అం**తర్జాతీయ కో ఆపరేటివ్స్ అలయన్స్, ఇర్మా ... ఆనంద్, ఐ.సి.ఏ. దోమాస్ ట్రస్ట్ సహకారంతో సహకార సూత్రాలలోని 4వ సూత్రం 'సహకార సంస్థల స్వయం ప్రతిపత్తి, స్వాతంత్ర్యం'పై ఒకరోజు చర్చాగోష్ఠిని (కన్సల్టేషన్ వర్క్‌షాప్) ఆగస్ట్ 26 వ తేదీన ఏపిమాస్ నిర్వహించింది. హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ గోష్ఠిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుండి సహకార రంగ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు. కొందరు సమావేశానికి నేరుగా హాజరు కాగా, మరికొందరు 'జూమ్ మీటింగ్' ద్వారా పరోక్షంగా పాల్గొన్నారు. సహకార సంఘాలపై అవగాహన కలిగిన ప్రముఖులు సి.డి.యఫ్ వ్యవస్థాపకులు, శ్రీ రామారెడ్డి, లోక్‌సత్తా వ్యవస్థాపకులు, విశ్రాంత ఐ.ఏ.యస్. అధికారి శ్రీ జయప్రకాష్ నారాయణ, ఏపిమాస్ డైరెక్టర్, ఇర్మా ... ఆనంద్ ప్రొఫెసర్ ఆచార్య శంభుప్రసాద్ , ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సిఎస్ రెడ్డి, ఎన్ ఎ ఎఫ్ సి ఓ బి–చైర్మన్ శ్రీ రవీందర్‌రావు, విశ్రాంత ఐ.ఏ.యస్. అధికారి శ్రీ భలేరావు, ముల్కనూర్ కో–ఆపరేటివ్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటి ఛైర్మన్ శ్రీ ఎ. ప్రవీణ్‌రెడ్డి, కేరళ ప్రభుత్వ సహకార సంస్థల రిజిస్ట్రార్, ఐఎఎస్. అధికారి శ్రీ అలెక్స్, తమిళనాడు నుంచి శ్రీ బాలాజి, సిడిఎఫ్ ఛైర్మన్ సరస్వతి గారు, స్త్రీనిధి వైస్‌ఛైర్ పర్సన్ రాఘవకుమారి గారు, సిడిఎఫ్ కు చెందిన రేవతి ఈ చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు.

శ్రీ సి.యస్ రెడ్డి గోష్ఠి ప్రారంభోపన్యాసంలో ఈ చర్చా గోష్ఠి ముఖ్య ఉద్దేశాలను తెలియజేస్తూ, సహకార సూత్రాలకు అనుగుణంగా సహకార సంస్థలను నడిపించాల్సి ఉందన్నారు. సహకార సంస్థలు సులభంగా వ్యాపారం చేయడానికి అనువైన పరిస్థితులు ఎలా వుండాలో, ఈ 21వ శతాబ్దంలో సహకార సంస్థలను ఆరోగ్యకరమైన పోటీతో వ్యాపారాన్ని నిర్వహించుకునే సంస్థలుగా మలచడం ఎలానో, కేంద్ర ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖకు, దక్షిణ భారత సహకార సంస్థలకు ఎలాంటి సూచనలు చేయాలో ఈ గోష్ఠి చర్చించి, సిఫారసు చేయాలని కోరారు.

సహకార సంస్థలపై ఇటీవల జరిగిన ఆనంద్ సదస్సు తీర్మానం గురించి శ్రీ శంభుప్రసాద్ వివరించారు. సహకార బ్యాంకులు రిజర్వు బ్యాంక్ ఆదేశాలకు అనుగుణంగా పని చేయాలేకాని వాటి నిర్వహణలో ప్రభుత్వాల ప్రమేయం ఉండకూడదని శ్రీ రవీందర్‌రావు పేర్కొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ సహకార రంగ ప్రముఖులు తమ అభిప్రాయాలను తెలిపిన తర్వాత, ప్యానెల్ చర్చల ద్వారా మరింతగా చర్చించి ఈ క్రింది అంశాలపై ఈ గోష్ఠి ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరచింది.

**నిగూఢ అవకాశాలను చూసే దార్శనికత, అసాధ్యాలను సాధించే తపన వుంటే గెలుపు మీదే**



- సహకార సంస్థలు తప్పనిసరిగా ఆర్థిక సంస్థలుగా వ్యవహరించాలి. అవి కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని నివారించడంలో మార్కెట్లో స్థిరత్వం కలిగి ఉండాలని పేర్కొనారు.



- సహకార సంఘాల స్థాపన అనేది రాష్ట్ర పరిధిలోని అంశం. కాబట్టి కేంద్ర ప్రభుత్వ జోక్యం ఉండకూడదు.
- ప్రాథమిక సహకార సంఘాలకు మోడల్ బైలాలను రూపొందించాలి. రాజ్యాంగ సవరణల ద్వారా సహకార సూత్రాలను నీరుగార్చడం కాక, సామరస్యం ఉండేలా ప్రభుత్వం మార్గనిర్దేశం చేయాలి.
- జర్మనీలో సహకార వ్యవస్థ పాత్ర ఎక్కువగా ఉండటం వల్ల ఆ దేశంలో అభివృద్ధి ఊపందుకుంది. భారతదేశంలో సహకార ఉద్యమాన్ని పునరుజ్జీవింప జేయడానికి వ్యూహాలను సిద్ధం చేయడంలో జర్మనీ నేర్పుతున్న పాఠాలను పరిగణనలోకి తీసుకోవాలి.
- అంతగా అక్షరాస్యత లేకపోయినా, సరైన క్రమబద్ధమైన పద్ధతులను అవలంబించడం ద్వారా మహిళలు సహకార సంఘాలను చక్కగా నడపడంలో విజయం సాధించారు. అందుబాటులో ఉన్న వనరులతో వారే పూర్తి యాజమాన్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు.
- ఈరోజు వారు సభ్యుల అవసరాలను తీర్చడానికి సాంకేతికతను / కొత్త ఆర్థిక ఉత్పత్తులను అన్వేషిస్తున్నారు. బ్యాంకులు కూడా ఎప్పటికప్పుడు వారి అవసరాలకు అనుగుణంగా ఆర్థిక ఉత్పత్తులకు మద్దతు యిస్తున్నాయి.
- అయితే, దురదృష్టవశాత్తూ, ఎస్‌హెచ్‌జి లలో (స్వయం సహాయక సంఘాలు) రాజకీయ, అధికార జోక్యంవల్ల రోజు రోజుకూ వాటి సామర్థ్యం తగ్గిపోతున్నది.

అన్ని ఆలోచనలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటే, సహకార సంస్థలు బలంగా ఉండాలని, వాటిని నియంత్రించడానికి కాకుండా కేంద్ర ప్రభుత్వం, పేదల అభివృద్ధిలో అంతరాలను పూరించడం ద్వారా సహకార సంస్థలు సుస్థిరంగా నిలదొక్కుకోనేలా సహకరించాలని ఈ చర్చాగోష్ఠి తీర్మానించింది. ■



పదవి, అధికారం, సంపద శాశ్వతం కావు; చక్కని వ్యక్తిత్వం, వివేకం మనిషిని చిరంజీవిని చేస్తాయి

# పంటలకు ఈ నెలలో తెగుళ్ళు ఎక్కువ ... బహుపరాక్ !

– శ్రీను, అనుష

**తె**లంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఈ సీజన్‌లో వేసిన పంటల విషయంలో యిప్పుడు పాటించవలసిన సస్య రక్షణ చర్యలు ఏమిటో, ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం.

**వరి**

రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రస్తుతం వరి ప్రాంతాలను బట్టి ఎక్కువ శాతం పిలకలుచేసే దశలో లేదా ముందు నాటు వేసుకున్నట్లు అయితే వాటి పిలక దశ నుండి అంకురం దశలో ఉన్నాయి. పిలకల దశలో ఉన్న వరి పైర్లలో ఎకరానికి 30– 35 యూరియాను లేదా అజటోబాక్టర్/ అజోస్పెరిల్లమ్ వంటి జీవన ఎరువులను పదనులో చల్లుకోవాలి లేదా ఒక ఎకరానికి ఒక లీటర్ హుమిక్ ఆసిడ్ పిచికారి చేసినట్లు అయితే మంచి ఫలితాలు పొందవచ్చు. పిలక దశలో కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదు.

వరి పంటలో చీడపీడల పరంగా సెప్టెంబర్ నెల చాలా క్లిష్టమైనది. అనగా ఈ మాసంలో చీడపీడల ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంది. ముందుగా వేసిన వరి పైర్లు చిరుపొట్ట దశ నుండి పూత దశలో ఉన్నపుడు, అధిక వర్షాలతో పండు తెగులు వచ్చే అవకాశం ఉంది. నివారణకు ఒక ఎకరాకు 200 మి.లీ. ప్రోపికొనజోల్ పిచికారి చేయాలి. లేదా టేబ్యుకోనజోల్ 80 గ్రా ఒక ఎకరాకు పిచికారి చేయాలి.

వరి పైరు దుబ్బు కట్టే దశలో ఉన్న ప్రాంతలలో పాముపొడ తెగులు ఆశించే అవకాశం ఉంది.

ఈ తెగులు గట్ల వెంబడి ఉన్న మొక్కలపై గమనించి నట్లయితే ఎకరానికి హేక్సకోనజోల్ 400 మీ లీ. లేదా ప్రోపికొనజోల్ 200 మీ. లీ. 200 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి.

గత సంవత్సరాల అనుభవాలు, సెప్టెంబర్ నెలలో ఉండే వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బాక్టీరియా ఎండకు తెగులు ఆశించే అవకాశం ఉంది. తెగులు లక్షణాలు గమ నించిన వెంటనే నత్రజని ఎరువులు వేయటం తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులు తొలిదశలో వ్యాప్తిని నివారించటానికి చిరుపొట్ట దశలో వరి పైర్లపై కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా, ప్లాంటమైసిన్ 4 గ్రా, 10 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి.

సెప్టెంబర్ మొదటి పక్షంలో కాండం తొలిచే రెక్కల పురుగు అధికంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా అంకురం నుండి చిరుపొట్ట దశలో ఉన్న వరి పైర్లలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% ఎకరానికి పిచికారి చేయాలి.

**మొక్క జొన్న**

ప్రస్తుత వర్షాలకు తేమను ఉపయోగించుకొని పూత దశలో ఉన్న పైరుకు 50 కిలోల యూరియా , 20 కిలోల యంఒపి ఎరువులు లేదా 5 కిలోల అజటోబాక్టర్ / అజోస్పెరిల్లమ్ వంటి జీవన ఎరువులను ఇసుకలో లేదా దిబ్బ ఎరువులలో కలిపి వేసుకోవాలి.

అధిక వర్షాల వల్ల మొక్కజొన్నలో ఏర్వినియ కాండం కుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉంది. తెగులు సోకిన మొక్క సుడిలో కుళ్ళినట్లు గమనించవచ్చు. అలాగే క్రింది భాగం కణుపు దగ్గర కూడా కుళ్ళి మొక్క నేలపై పడిపోతుంది.

నివారణకు ఎకరాకు 100 కిలోల వేపపిండి, 4 కిలోల క్లోరిన్ కలిగిన బ్లీచింగ్ పౌడర్ పొలంలో నేలపై చల్లాలి.

ముఖ్యంగా రబీ ఋతువులో మొక్కజొన్నకు లేత దశలో కత్తెర పురుగు సోకుతుంది. దీని నివారణకు 10–12 రోజుల పైరుపై వేపనూనె 5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి లేదా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పొగాకు కషాయం, అగ్ని అస్త్రం, వంటి కషాయాల ద్వారా నివారించుకోవాలి.

వేరెవ్వరో ప్రోత్సహించడం కాదు, నిన్ను నీవే ప్రోత్సహించుకోవాలి ; స్వయం ప్రోత్సాహం అమోఘం

పురుగు ఉధ్రిక్తత ఎక్కువ ఉంటే ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా, లేదా కోరాజేన్ 0.4 మీ, లీ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కత్తెర పురుగు నివారణకు వాడే కషాయాలు లేదా మందు ద్రావణాలు మొక్క సుడిలో పడునట్లు సాయంకాలం వేసుకోవాలి.

**పత్తి**

పత్తి పంట ప్రస్తుతం పూత దశలో, కొన్నిచోట్ల ముందుగా విత్తుకున్న పత్తి కాత దశలో ఉంది. పత్తిని ప్రస్తుత దశలో పేనుబంక, తామర పురుగు, పచ్చదోమ, పిండినల్లి ఆశించే అవకాశం ఉంది. కొన్నిచోట్ల గులాబీ రంగు పురుగు ఆశించి నష్టపరుస్తున్నట్లు కూడా గమనించటం జరిగింది.

ఈ దశలో పత్తి పంటలో పేనుబంక, పచ్చదోమ, తామర పురుగులు మొదలగు రసం పీల్చే పురుగులు ఆశిస్తాయి. పురుగు నివారణకై ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా, 200 లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి లేదా ప్రకృతి వ్యవసాయ పద్దతిని పొగాకు కషాయం, వావిలాకు కషాయం, వేప నూనె వంటి మిశ్రమ మందులను పిచికారీ చేయాలి.

పంట తొలి దశలో ఆశించే గుడ్డి పూలను ఏరి నాశనం చేస్తే గులాబీ రంగు పురుగు నివారణ చాలా సులభం అవుతుంది. గులాబీ పురుగు నివారణకు 2 మి.లీ ప్రొపెనోఫాస్ లేదా 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్, 200 లీటర్ నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో మందులు పిచికారి చేయాలి.

**వేరుశనగ**

పంటపై శనగపచ్చ పురుగు లేదా పొగాకు లద్దె పురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వావిలాకు కషాయం లేదా పొగాకు కషాయం పిచికారీ చేయటం వలన నివారించవచ్చు.

అలాగే నోవాల్యురాన్ 200 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 60 గ్రా, 200 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**సోయా చిక్కుడు**

సోయాచిక్కుడు పంట ప్రస్తుతం కాయ తయారయ్యే దశలో ఉన్నది.

ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల నీటి ముంపు ఏర్పడి మొక్కల ఎదుగుదల నిలిచిపోతుంది. అలాగే పోషకాల లోపం ఏర్పడుతుంది. ముందుగా పొలం నుండి నీటిని కాలువల ద్వారా బయటికి పంపాలి.

ప్రధాన పోషకాల లోపాలను సవరించడానికి నీటిలో కరిగే ఎరువులైన 19-19--19/20-20-20/13-0-45 నత్రజని, భాస్వరం, పొటాష్‌లను లీటర్ నీటికి 10 లేదా 20 గ్రా. వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు వేసుకోవాలి.

పంట ఈ దశలో పొగాకు లద్దె పురుగు / ఆకుముడత ఆకుచుట్టు పురుగు ఆశించినచో ప్రకృతి వ్యయసాయ పద్ధతిలో పొగాకు కషాయం లేదా అగ్నిఅస్త్రం లేదా వావిలాకు కషాయం పిచికారీ చేసుకోవాలి.

పురుగు ఉధృతి ఎక్కువ ఉన్నట్లు అయితే ఎకరాకు థయోడికార్బ్ 3 గ్రా, లేదా క్లోరిపైరిఫాస్ 500 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రసం పీల్చే పురుగుల నివారణకు (పేనుబంక, పచ్చదోమ, మరియు తామర) ఎకరానికి ఎసిపేట్ 300 గ్రా, లేదా వేపాకు కషాయం లేదా వావిలాకు కషాయం పిచికారి చేయాలి.

పైరు లేత దశలో వేరుకుళ్లు ఆశించి మొక్కలు ఎండి పోయి చనిపోవటం గమనిస్తే లీటర్ నీటికి 3 గ్రా, ట్రైకోడెర్మా విరిడె లేదా సూడోమోనాస్ ద్రావణాలను చెట్టు మొదల్లో పోయాలి లేదా లీటర్ నీటికి 3 గ్రా, కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా 2 గ్రా, కార్బండిజమ్ం మాంకోజెబ్ మిశ్రమ మందులను మొక్క చుట్టూ భూమిని తడపాలి.

**టమాట**

టమాట పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. టమాట పంటలో ప్రస్తుతం రసం పీల్చే పురుగులు పేనుబంక, పచ్చ దోమ, మరియు తామర ఎకరానికి ఎసిపేట్ 300గ్రా లేదా

*(మిగతా 12వ పేజీలో ...)*

**ఉత్తమమైనదాని కోసం వెంపర్లాడడం కాదు, అందినదానిని అత్యుత్తమంగా మలచుకోవడం నేర్చుకో!**

# చేనేతకు నాబార్డ్ ప్రోత్సాహానికి మంత్రి దయాకరరావు ప్రశంస

**జా**తీయ చేనేత దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం (ఆర్ ఓ) వరంగల్లులో 2022 ఆగస్ట్ 17 నుంచి 22 వ తేదీ వరకు రాష్ట్రస్థాయి చేనేత ప్రదర్శన (ఎగ్జిబిషన్) ను నిర్వహించింది.





తెలంగాణా ప్రభుత్వ పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి శ్రీ ఎర్రబెల్లి దయాకర రావు ఆగస్ట్ 17 వ తేదీన ఈ ప్రదర్శనను ప్రారంభించారు. నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల, వరంగల్లు మేయర్ శ్రీమతి సుధారాణి, వరంగల్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ గోపి, ఐ ఏ ఎస్ , తెలంగాణా ప్రభుత్వ చేనేత శాఖ సీనియర్ అధికారులు, వాణిజ్య బ్యాంకుల ప్రాంతీయ అధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీ దయాకర రావ ప్రధాన ప్రసంగంచేస్తూ తెలంగాణాలో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి రంగాలలో నాబార్డ్ నిర్వహిస్తున్న పాత్రను కొనియాడారు. చేనేతకు మద్దతుగా తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా వున్న చేనేత కళాకారుల ఉత్పత్తులతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నందుకు శ్రీ దయాకర రావు నాబార్డ్ ను అభినందించారు.

నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల తన ప్రసంగంలో ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు మంత్రి శ్రీ దయాకర రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఇండియాలో జాతీయ చేనేత దినోత్సవ ప్రాముఖ్యాన్ని, నాబార్డ్ నిర్వహిస్తున్న పాత్రను ఆమె వివరించారు. ఇలాంటి ప్రదర్శనలు చేనేత కళాకారులకు చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్, ధర నిర్ణయం, మార్కెట్ తీరుతెన్నులు వంటి అంశాలపై అవగాహనకు దోహదం చేస్తాయని శ్రీమతి సుశీల చింతల అన్నారు. నాబార్డ్ ఇకపై కూడా రాష్ట్రంలో చేనేతకు తన మద్దతు కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు.

ఈ ప్రదర్శన ప్రారంభోత్సవ సమావేశంలో జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా లోని మహదేవపూర్ టస్సార్ శిల్క్ నేత కార్మిక సంఘానికి 'నా జిల్లా, నా ప్రాజెక్ట్' పథకంకింద మంజూరైన ప్రాజెక్ట్ మంజూరు పత్రాన్ని మంత్రి శ్రీ దయాకర రావు, సి జి ఎం శ్రీమతి సుశీల చింతల అందజేశారు. 'ప్రధానమంత్రి ముద్ర నేతకళాకారుల పథకం' కింద కెనరా బ్యాంక్ మంజూరుచేసిన ప్రాజెక్టుల మంజూరు పత్రాలనుకూడా ఈ సమావేశంలో సంబంధిత కళాకారులకు అందజేశారు.

సి జి ఎం శ్రీమతి సుశీల చింతల వరంగల్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌ను (డి సి సి బి ని) సందర్శించి, ఆ బ్యాంకి ఛైర్మన్, సి ఇ ఓ , ఇతర సీనియర్ అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం డి ఐ సి–జిఎం, ఎల్ డి ఎం, టెక్స్‌టైల్ పార్క్ ప్రెసిడెంట్ తో కలసి టి ఎస్ ఐ ఐ సి, ఎంఎస్ ఎం ఇ ఏర్పాటుచేసిన కాకతీయ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శించి ఆ పార్క్‌లోని వివిధ యూనిట్లు పనిచేస్తున్న తీరు గురించి, ప్రాజెక్ట్ అమలులోని సమస్యల గురించి కూలంకషంగా చర్చించారు. ■

ఓడించడం కాదు, మనసులను గెలుచుకో ;హేళనగా నవ్వడం కాదు అందరితో ఆనందంగా నవ్వుకో

# తెలంగాణా ఆర్ ఓ చే నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవం



**నా**బార్డ్ 41వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం 2022 జులై 13 వ తేదీన నిర్వహించిన కార్యక్రమానికి ఎన్ ఏ ఎస్ సి ఓ బి ఛైర్మన్, తెలంగాణా రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ప్రెసిడెంట్ శ్రీ కె. రవీందర్ రావు ముఖ్యఅతిథిగా హాజరైనారు. శ్రీ రవీందర్ రావు తన ప్రధాన ప్రసంగంలో గ్రామీణ భారతానికి నాబార్డ్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. నాబార్డ్ వ్యవస్థాపన నుంచి కూడా రుణ ప్రణాళిక, పర్యవేక్షణ, రుణ సహాయానికి మించిన సేవలను అందిస్తున్నదని ఆయన అన్నారు. సహకార బ్యాంకులలో సి బి ఎస్ అమలుకు , పాక్స్ లను బహుళ సేవా కేంద్రాలుగా (ఎం ఎస్ సి లు) అభివృద్ధిచేయడంలో, ఆర్థిక చేకూర్పుతో గ్రామీణ ఖాతాదారులకు గ్రాంట్‌లు అందివ్వడంలో నాబార్డ్ కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**నాబార్డ్ తెలంగాణా ఆర్ ఓ–సి జి ఎం:** అంతకు ముందు నాబార్డ్ తెలంగాణా ఆర్ ఓ–సి జి ఎం శ్రీ వై కె రావు తన స్వాగతోపన్యాసంలో నాబార్డ్ 40 ఏళ్ళ ప్రస్థానాన్ని క్లుప్తంగా వివరించారు. గ్రామీణ భారత సమగ్రాభివృద్ధికై నాబార్డ్ అమలుచేసిన , చేస్తున్న వివిధ కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు. తెలంగాణాలో మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్ట్, గోదాముల నిర్మాణం వంటి వివిధ భారీ ప్రాజెక్టులకు నాబార్డ్ అందిస్తున్న తోడ్పాటును కూడా ఆయన తెలియజేశారు.

**శ్రీమతి యశోదాబాయి, జి ఎం, ఆర్ బి ఐ:** నాబార్డ్ ఒకే అంశంపై దృష్టి కేంద్రీకరించడం నుంచి దేశంలో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకునే బహుళ అంశాల నిర్వాహక సంస్థగా పరిణతి చెందిన తీరును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జి ఎం శ్రీమతి యశోదాబాయి కొనియాడారు.

**ఎస్ బి ఐ–సి జి ఎం, ఎస్ ఎల్ బి సి ప్రెసిడెంట్:** తెలంగాణా రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో నాబార్డ్ కీలకపాత్ర పోషిస్తూ, కరోనా కల్లోలంలో సైతం అందించిన సహకారాన్ని ఎస్ బి ఐ–సి జి ఎం, ఎస్ ఎల్ బి సి ప్రెసిడెంట్ శ్రీ అమిత్ ఝింగ్రాన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**నాబార్డ్ ఏపి ఆర్ ఓ–సి జి ఎం:** వివిధ అంశాలలో కనబరచిన విశిష్ట పనితీరుకుగాను ఇటీవల ముగిసిన బిజినెస్ ప్లాన్ సమావేశంలో అనేక అవార్డులను గెలుచుకున్నందుకు నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయాన్ని నాబార్డ్ ఏపి ఆర్ ఓ–సి జి ఎం శ్రీ ఎం ఆర్ గోపాల్ అభినందించారు. నాబార్డ్ ఐదవ దశాబ్దిలో చేపట్టవలసిన ముఖ్యమైన కార్యక్రమాల రోడ్ మ్యాప్ గురించి కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఛైర్మన్ శ్రీ కె. ప్రవీణ్ కుమార్, తెలంగాణా గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ శ్రీ వి. అరవింద్, తెలంగాణా రాష్ట్ర సహకార బ్యాంక్ ఎండి డాక్టర్ ఎన్ మురళీధర్ నాబార్డ్ సేవలను కొనియాడుతూ, 'బంగారు తెలంగాణా' స్వప్నాన్ని సాకారంచేసే దిశగా నాబార్డ్ తెలంగాణా ఆర్ ఓ అమలుచేస్తున్న వినూత్న కార్యక్రమాలను అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఉత్తమ గ్రామీణ వాటర్‌షెడ్ కమిటీలకు, ఎఫ్ పి ఓలకు, మా తోట అభివృద్ధి కమిటీకి అవార్డులను బహూకరించారు. ' రిఫ్లెక్షన్స్ 2021–22–నాబార్డ్ ఇన్ తెలంగాణా' , ' ఇండికేటివ్ యూనిట్ కాస్ట్ ఫర్ ఫామ్ సెక్టర్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫర్ ది యియర్ 2022–23' అనే చిరు పుస్తకాలను ఆవిష్కరించారు. ■

# చిత్తూరు జిల్లాలో ఎఫ్ పి ఓల తీరుపై సి ఎస్ సమీక్ష

– ప్రహల్లాద

ఏపిమాస్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి ఆగస్ట్ 16వ తేది నుండి 19వ తేది వరకు అవిభక్త చిత్తూరు జిల్లాలో ఏపిమాస్ ద్వారా అమలు జరుగుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించారు.

ఉత్తేజభరితంగా సాగిన ఈ పర్యటన యిటు సిబ్బంది లోను, అటు రైతు ఉత్పత్తిదారు సంస్థల (ఎఫ్ పి ఓలు, ఎఫ్ పి సిల) కార్యవర్గ సభ్యులలోను నూతనోత్సాహం నింపింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారు సంస్థలకు ఈక్విటి గ్రాంట్ మంజూరైనందున వారు చాలా సంతోషంగా వున్నారు. వివిధరకాల వ్యాపార అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు.





శ్రీ సి.ఎస్.రెడ్డి పర్యటన, పరిశీలన వివరాలు క్లుప్తంగా...

**ఆగష్టు 16 ఉదయం:** బైరెడ్డిపల్లిలో ఎన్‌సిడిసి ద్వారా ఏర్పాటు అయినటువంటి శ్రీ నల్ల గుండరాయస్వామి రైతు ఉత్పత్తిదారుల సంస్థను సందర్శించి, కార్యవర్గసభ్యులతోను, సిబ్బందితోను చర్చించి వారు చేపట్టిన వివిధ వ్యాపారాభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. సంస్థ మరింతగా ముందుకు సాగడానికి శ్రీ రెడ్డి సలహాలు యిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులతో పాటు ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ అమరేంద్రుడు పాల్గొన్నారు.

**ఆగష్టు 16 మధ్యాహ్నం :** పుంగనూరులో ఎన్‌సిడిసి ద్వారా ఏర్పాటైన శ్రీ సుగుటూరు గంగమ్మ రైతు ఉత్పత్తి దారుల సంస్థను సందర్శించి అక్కడ జరిగే వివిధ రకాల వ్యాపార అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ప్రాజెక్టు మేనేజరు శ్రీ ప్రహల్లాద, సేల్స్‌పర్సన్ శ్రీ సోమశేఖర్‌తో పుస్తక నిర్వహణ, ఇతర పత్రాల గురించి చర్చించి అక్కడ అమలులో వున్న వివిధ రకాల పుస్తకాలను, ఇతర పత్రాలను పరిశీలించి, పుస్తకాలను మరింత నాణ్యంగా నిర్వహించ డానికి తగు సలహాలు యిచ్చారు. అక్కడ అమ్మే పశువుల క్యాల్షియం క్యానులను పరిశీలించారు.

**ఆగస్ట్ 17 ఉదయం :** పశుగ్రాస మరియు ఆహార భద్రతలను సాధించుటయే లక్ష్యంగా వాల్మీకిపురం మండలం లో అమలులో వున్న "పాడి పంటలు" కార్యక్రమాలను శ్రీ సి ఎస్ రెడ్డి సందర్శించారు. అక్కడ సిబ్బంది శ్రీ అబ్దుల్ ఖాదర్, శ్రీమతి అనుషా, శ్రీ హసన్, శ్రీ సాత్విక్, శ్రీ సురేష్, వాల్మీకిపురం రైతు ఉత్పత్తిదారు సంస్థల కార్యవర్గ సభ్యులతో సంస్థ చేపట్టిన వ్యాపార కార్యక్రమాలను చర్చించారు.

అనంతరం కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడ పాడి పంటల కార్యక్రమాలలో భాగంగా అమలులో వున్న వివిధ రకాల సమీకృత గడ్డి జాతుల సాగును, వాటిని వినియోగించినందువలన పశువులలో పెరిగిన పాల పరిమాణాన్ని అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో ఆచరణలో వున్న ఐదు అంతస్తుల పంట విధానాన్ని, వర్మి ఎరువు, పశువుల బోనులు, గడ్డి కత్తిరించే యంత్రాలు, గులి రాగి సాగు తీరు, నర్సరీ, రైతు పొలంబడి మొదలగు కార్యక్రమాలను పరిశీలించారు.

ఎవరి జీవితమూ పరిపూర్ణం కాదు , కాని ప్రతి క్షణాన్ని మంచిగా జీవించగలిగితే అది సంపూర్ణమే





తరువాత బురుజుగడ్డ గ్రామాన్ని సందర్శించి అక్కడ పెంచుతున్న విత్తన పొట్టేండ్ల ప్రగతిని గొర్రెల కాపరులను అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో ఏర్పాటు చేసిన జీవనఎరువుల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరిగే అమ్మకాలను, రైతుల మనోభావాలను , సేంద్రియ ఎరువు వినియోగాన్ని అడిగి తెలుసుకున్నారు.

అయ్యవారి పల్లెను సందర్శించి అక్కడ సభ్య రైతులకు కూరగాయల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. అనంతరం అక్కడ సభ్య రైతులతో కొంతసేపు ముచ్చటించి రైతు ఉత్పత్తిదారు సంస్థల వలన భవిష్యత్‌లో కలిగే వివిధ రకాల ఉపయోగాలను వారికి వివరించారు.

**ఆగస్ట్ 17 మధ్యాహ్నం :** వాల్మీకిపురం క్షేత్ర సందర్శన అనంతరం మధ్యాహ్నం మదనపల్లిలోని ఏపిమాస్ కార్యాలయంలో ప్రాజెక్టు మేనేజర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, రైతు ఉత్పత్తిదారు సంస్థల కార్యక్రమాలను, వాటి మనుగడ ప్రస్తుత పరిస్థితిని సమీక్షించి, భవిష్యత్‌లో రైతు ఉత్పత్తిదారు సంస్థలు మరింత సుస్థిరతతో సాగడానికి ఏపిమాస్ ద్వారా ఎటువంటి చర్యలు చేపట్టాలో సిబ్బందికి నిర్దేశం చేశారు. రెండురోజుల పర్యటన ఆసాంతం ఉత్సాహంగా సాగింది. ■

## బస్సు డ్రైవర్లుగా మహిళలు

**ఢి**ల్లీ రవాణా మంత్రి కైలాష్ గెహ్లాట్ నుండి మొత్తం 11 మంది మహిళా బస్సు డ్రైవర్లు తమ అపాయింట్‌మెంట్ లెటర్‌లను స్వీకరించారు. ఈ మహిళలు బస్సు డ్రైవర్లుగా తమ వృత్తిని ప్రారంభించనున్నారు. త్వరలో వివిధ మార్గాల్లోని బస్సుల్లో వీరిని డ్రైవర్లుగా నియమిస్తారు.

మహిళలు అసాధారణంగా భావించే వృత్తిని ఎంచుకున్నారు. మహిళలు తలచుకుంటే అన్ని రంగాల్లో రాణిస్తారంటూ తమ కుటుంబ సభ్యులకు, పరిచయస్తులకు ఒక ఉదాహరణగా నిలిచారు.

(8వ పేజీ తరువాయి)

**పంటలకు ఈ నెలలో తెగుళ్ళు ఎక్కువ ... బహుపరాక్ !**

వేపాకు కషాయం లేదా వావిలాకు కషాయం పిచికారి చేయాలి. టమాట పంటలో ముఖ్యంగా కాయ తొలుచు పురుగు ఈ మాసంలో వచ్చే అవకాశం ఉంది కాబట్టి పురుగు నివారణకు డైమిథోయేట్ 2 మి.లి. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. తేమతో కూడిన చల్లని వాతారణంలో ఆకుమాడు తెగులు అధికంగా ఉంటుంది. దీని నివారణకు 2.5 గ్రా, మ్యాంకోజెబ్ 15 రోజుల వ్యవదిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**మామిడి**

ఇప్పటివరకు కురిసిన అధిక వర్షాల వల్ల వచ్చే వివిధ మచ్చ తెగుల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. వర్షాలు ఆగిన తరువాత పొలం మధ్యలో దున్నాలి తద్వారా కలుపు నివారించుకోవచ్చు అలాగే పురుగులను నివారించవచ్చు. ■

సమస్యలు నీ సంతోషాన్ని దూరం చేసే లోగా నీవే సమస్యలను దూరం చేసుకోగలగాలి

# ఏపిమాస్ ప్రముఖులచే పీలేరు ఎఫ్‌పిఓ సందర్శన

– డా. భార్గవి

ఏపిమాస్ బోర్డు మెంబర్, ఇర్మా ప్రొఫెసర్ శ్రీ శంభు ప్రసాద్, ఏపిమాస్ సిఈఓ శ్రీ సి ఎస్ రెడ్డి అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలోని పీలేరు వ్యవసాయ ఉత్పత్తి దారుల కంపెనీని ఇటీవల విడిగా సందర్శించారు. పీలేరు ఎఫ్‌పిఓలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను అక్కడ వున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌పిఓ ఏర్పాటు చేసినప్పటి నుండి ఇప్పటివరకు జరిగిన వ్యాపారం గురించి, లాభాల గురించి చర్చించారు.



పీలేరు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం 20 పంచాయతీలలోని 25 గ్రామాలలో 700 మందికి వారి సేవలను అందిస్తూ ప్రతి నెల పాలకవర్గ సభ్యులు సమావేశమై వారి వారి పంచాయతీ పరిధిలో గల రైతులకు ప్రాతినిధ్యం వహిస్తూ ఎఫ్ పి ఓ ద్వారా రైతులకు అవసరమైన సేవలను సమాయానుసారంగా అందేలా చూడడం గురించి, ఎఫ్‌పిఓ భవిష్యత్ కార్యక్రమాల గురించి చర్చించడాన్ని వారిని అడిగి తెలుసుకున్నారు.

వ్యాపార అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేసి వాటి పనితీరును ప్రతి నెలా సమీక్షించి తగు సలహాలు సూచనలు ఇవ్వడం గురించి, వివిధ కంపెనీలతో కలిసి ఎఫ్‌డిసి ద్వారా కాంప్లెక్స్ ఎరువులు, డ్రిప్ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, పశువుల దాణా, అవసరమైన వ్యవసాయ పరికరాలు మొదలగునవి ప్రైవేటు డీలర్ల కంటె తక్కువ ధరకు రైతులకు అమ్మడం గురించి ప్రశంసించారు.

పీలేరు మండల పరిధిలో ఎక్కువగా రైతులకు పాడి ఆవుల పెంపకం జీవనాధారం కలిగి ఉన్నందున పశువులకు కావల్సిన దాణాపై ఎక్కువగా ఖర్చు పెడుతున్నారు. కావున ఖర్చులు తగ్గించుటకు పాడి ఆవుల పెంపకం కొరకు సమతుల్య ఆహారం కోసం మంచి పోషకాలున్న గడ్డిని ప్రోత్సహించడం గురించి, ఎఫ్‌పిఓ సభ్యులకు శాస్త్రీయ పద్ధతిలో పశు పోషణ, వ్యాధుల నివారణ, పశుగ్రాస పెంపకం, అధిక పాల ఉత్పాదన, దూడల పెంపకం, చూడి పశువుల పెంపకంపై అవగాహన కల్పించడం గురించి, గొర్రెలు, మేకల పోషణ, వ్యాధుల నివారణ, అధిక మాంసపు ఉత్పత్తులపై ఎఫ్ పి ఓ రైతులకోసం నిర్వహిస్తున్న అవగాహనా కార్య క్రమాలను గురించి తెలుసుకున్నారు.

మామిడి, టమాట మొదలగు పంటలకు సోకే వివిధ రకాల జబ్బులను ఆదిలోనే గుర్తించి నివారించుటకు చేపట్టవలసిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని, పంట వ్యయాలను తగ్గించుటకు వివిధ రకాల కార్య క్రమాలను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పంట యాజమాన్య పద్దతులలో విలువ గొలుసు, విలువ జోడింపు కార్యక్రమాల గురించి రైతులకు తగు సలహాలు, సూచనలు అందజేయాలని, సుస్థిర వ్యవసాయ విధానాలపై రైతులకు శిక్షణలు, క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేయాలని, సమిష్టి మార్కెటింగ్ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించి ఎఫ్ పి ఓ రైతులకు లాభసాటి ధర అందించాలని కోరారు. ■

ఒంటరిగా కుంగిపోతే ప్రతి చిన్న సమస్య కొండంత , సరైనవారితో పంచుకుంటే గులిగింజంత

# నిబంధనలకు నీరాజనం ... వార్షిక మహాసభల సంరంభం !

ప్రతి సంవత్సరం విధిగా వార్షిక మహాసభను నిర్వహించాలన్న చట్టపరమైన కట్టుబాటును పాటిస్తూ, ఏపిమాస్ ఆధ్వర్యంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు, ఎఫ్‌పిసిలు ఈ నెలలో వార్షిక మహాసభలను నిర్వహించాయి. పెదమండ్యంలోని కామధేను ఎఫ్ పి ఓ, తంబళ్ళపల్లి, కురబలకోట, పామిడి, కలికిరి, తదితర రైతు ఉత్పత్తిదారుల సంస్థలు అన్ని అంశాలతో వార్షిక మహా సభలను నిర్వహించుకున్నాయి.

**కామధేను మహాసభ**

పెద్ద మండ్యంలోని 'కామధేను ఎఫ్ పి ఓ' వార్షిక మహా సభ 26-08-2022 వ తేదీన స్థానిక ఎం పి డి ఓ సమావేశ మందిరంలో జరిగింది. జ్యోతి ప్రజ్వలన , ప్రార్ధన అనంతరం సభ ప్రారంభమైంది. ఈకార్యక్రమంలో 145 మంది సభ్యులు పాల్గొన్నారు అందులో 25 మంది మహిళా సభ్యులు వున్నారు. ముందుగా పెద్ద మండ్యం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ శ్రీధర్ , ఉద్యానవన అధికారిణి శ్రీమతి తేజశ్వని , మండల పశువైద్య అధికారి డాక్టర్ ఉస్మాన్ , ఏపిమాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ వినాయక రెడ్డి, స్థానిక ఎంపిటిసి శ్రీ జయరాం, ఆర్ వై ఎస్ ఎస్ ఎం ఆర్ పి శ్రీ వెంకట రామరాజు ఈ మహాసభలో పాల్గొని, తమ ప్రసంగాల ద్వారా అమూల్యమైన సలహాలు, సూచనలు అందించడమే కాకుండా, వారి శాఖల ద్వారా ఎఫ్ పి ఓ సభ్యులకు అందుబాటులోవున్న పథకాల గురించి, వాటి ప్రయోజనాల గురించి వివరించారు.

అనంతరం మహాసభ సభ్యుల కోరిక మేరకు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ వినాయకరెడ్డి ఎఫ్ పి ఓలను ప్రారంభించే ఉద్దేశాలు, మహిళాభ్యున్నతికి, సహజవనరుల (ఎన్ఆర్ఎం) అభివృద్ధి కోసం, రైతు ఉత్పత్తి దారుల సంఘాల అభివృద్ధి కోసం, మన దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు, కొన్ని ఇతర దేశాలలో కూడా పని చేస్తున్నదని తెలిపారు.

అంతకు ముందు సంఘ అధ్యక్షులు శ్రీ శివారెడ్డి ప్రారంభోపన్యాసంచేసి, 2021-22 వార్షిక నివేదికను చదివి వినిపించిన తర్వాత మహాసభలోని ఎఫ్ పి ఓల ప్రతినిధులు చేతులుపైకెత్తి తమ ఆమోదం తెలిపారు. ఆ తర్వాత సంఘ కార్యదర్శి శ్రీ పెద్ద రెడ్డెప్ప రెడ్డి సంఘ 2022-23 వార్షిక ప్రణాళికను చదివి వినిపించి మహాసభ ఆమోదం పొందారు. అనంతరం సంఘ కోశాధికారి శ్రీ రఘునాథ రెడ్డి 2021-22 వార్షిక ఆడిట్ నివేదికను, వార్షిక సంఘ నిర్వహణ ఖర్చులను మహాసభకు వినిపించి మహాసభ ఆమోదం పొందారు. 2022-23 సంవత్సరానికి ఆడిటర్ నియామకం, ఖాళీ అయిన డైరెక్టర్ల స్థానంలో కొత్త వారిని ఎన్నుకోవడం మొదలగు తీర్మానాలకు మహాసభ సభ్యులు చేతులు పైకెత్తి తమ ఆమోదం తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెంచూరియ అగ్రిటేక్ టెరిటరీ మేనేజర్ శ్రీ నారాయణ స్వామి నాయక్, సుముఖ బయో ప్రొడక్ట్ తరుపున ఏరియా మేనేజర్ శ్రీ వేణు మాధవ్ పాల్గొని వారి సంస్థల ఉత్పత్తుల వలన రైతులకు కలిగే లాభాలను వివరించారు. వారి ఉత్పత్తుల స్టాల్స్ కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ గంగాద్రి, ఎఫ్ పి ఓ సిఇఓ శ్రీ అమర్‌నాథ రెడ్డి,ఏపిమాస్ సోషియల్ మొబిలైజర్ శ్రీ నాగేంద్ర బాబు, సి ఇ ఓ శ్రీ కార్తికేయ కుమార్ పాల్గొన్నారు. సి ఇ ఓ శ్రీ అమర్నాథ్ రెడ్డి వందన సమర్పణతో మహాసభ ముగిసింది.

**తంబళ్ళపల్లి మహాసభ**

24-08-2922 తంబళ్లపల్లి ఎఫ్‌పిఓ ద్వితీయ వార్షిక మహాసభ జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన , ప్రార్ధన అనంతరం సభ ప్రారంమైంది. ఈకార్యకమంలో ఉద్యానవన అధికారిణి శ్రీమతి తేజశ్వని గారు, ఏపిమాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ వినాయక రెడ్డిగారు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.

అంతకు ముందు సంఘ అధ్యక్షులు శ్రీ పాపినాయుడు ప్రారంభోపన్యాసం చేయగా, సంఘ కార్యదర్శి శ్రీ విశ్వనాథరెడ్డి సంఘ 2021-22 వార్షిక నివేదికను,

**జీవితమనే నాణానికి ఒకవైపు ఆనందం మరోవైపు అవేదన; ఒక్కటేకాదు రెండూ వుంటాయని మరచిపోకు**

2022-23 వార్షిక ప్రణాళికను చదివి మహాసభ ఆమోదం పొందారు. అనంతరం సంఘ కోశాధికారి శ్రీ మధుకర్‌రెడ్డి 2021-22 వార్షిక అడిట్ నివేదికను, వార్షిక సంఘ నిర్వహణ ఖర్చులను చదివి వినిపించి, మహాసభ ఆమోదం పొందారు. కొత్త ఆడిటర్ నియామకం మొదలగు తీర్మానాలకు మహాసభ చేతులు పైకెత్తి తమ ఆమోదం తెలియజేసింది.

ఈ కార్యక్రమంలో గ్రోమోర్ ఏరియా మేనేజర్ శ్రీ సాగర్, వెంచూరియ అగ్రిటేక్ టెరిటరీ మేనేజర్ శ్రీ నారాయణస్వామి నాయక్ పాల్గొని వారి కంపెనీల ఉత్పత్తుల వలన రైతులకు కలిగే లాభలను వివరించారు, అలాగే వారి ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించడంలో ప్రాజెక్ట్ మేనేజర్ డా. గంగాద్రి, ఎఫ్‌పిఓ సిఈఓ ప్రభావతి, ఏపిమాస్ సోషియల్ మొబిలైజర్ శ్రీ నాగేంద్ర బాబు , సిఇఓలు అమర్నాథ్ రెడ్డి, కార్తికేయ కుమార్ తోడ్పాటు అందించారు. సిఇఓ ప్రభావతి గారి వందన సమర్పణతో మహాసభ ముగిసింది.

## వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీ

స్వల్పకాలిక వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీ పునరుద్ధరించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. రూ.3. లక్షల వరకు ఉన్న రుణాలపై 15 శాతం చొప్పున రాయితీ ఇవ్వనున్నారు. ఈ రాయితీ మొత్తాన్ని రుణాలు జారీచేసే ఆర్థిక సంస్థలకు కేంద్రం చెల్లిస్తుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ తీసుకున్న వడ్డీ రాయితీ నిర్ణయం వల్ల వ్యవసాయ రంగానికి రుణ లభ్యత పెరుగుతుందని కేంద్రం పేర్కొంది. 2022-23 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాలకు గానూ ఈ స్కీమ్ వర్తిస్తుందని తెలిపింది. దీనివల్ల రూ.34,856 కోట్లు కేంద్రంపై భారం పడుతుందని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్, రీజినల్ రూరల్ బ్యాంకులు, కో-ఆపరేటివ్, ప్రాథమిక పరపతి సంఘాలకు ఈ వడ్డీ రాయితీ వర్తిస్తుందని కేంద్రం వెల్లడించింది.

# సంఘంలో సభ్యుల సంఖ్య పెంచాలి

పెద్దమండ్యం : రైతు ఉత్పత్తిదారులు పరస్పర సహాయక సహకార సంఘంలో సభ్యుల సంఖ్య పెంచాలని అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. పెద్దమండ్యంలో కామధేను రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌తో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో ప్రస్తుతం ఉన్న 250 మందితో పాటు మరో 100 మంది రైతులను సభ్యులుగా చేర్చాలన్నారు. సభ్యుల సంఖ్య పెరగడంతో మూలధనం పెరగడం ద్వారా నాబర్డ్ నుంచి నిధులను పొందవచ్చన్నారు.

రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సంఘం ద్వారా ఇప్పటికే సభ్యత్వం ఉన్న రైతులకు రసాయనిక ఎరువులు, టార్పాలిన్ పట్టలు మార్కెట్ ధరకంటే తక్కువకు అంద జేస్తున్నట్లు తెలిపారు.మండలంలో టమాట నర్సరీని ఏర్పాటు చేసుకుని, సంఘంలోని రైతులకు కావాల్సిన రకాల మొక్కలను సరఫరా చేసు కోవాలని సూచించారు. అలాగే సెర్ఫ్ అధికారులను సమ న్వయం చేసుకుని టమాట ప్రాసెసింగ్ యూనిట్, వేరుశనగ నూనె సేకరించే యంత్రాలు, మినీ డైరీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

### ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి

ఉద్యాన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు సూచించారు. ఆయన తంబళ్లపల్లె ఎఫ్‌పిఓ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఏపీమాస్ ప్రాజెక్ట్ మేనేజరు గంగాద్రితో కలసి ఎఫ్‌పిఓ బీవోడీలు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షేడ్ నెట్ హౌస్, ప్యాక్ హౌస్, మోడల్ నర్సరీ, కలెక్షన్ సెంటర్, సోలార్ కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్ తదిదర పథకాలు వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారిణి తేజశ్విని, ఎఫ్‌పిఓ సీఈవో ప్రభావతి, అధ్యక్షులు పాపినాయుడు, కార్యదర్శి విశ్వనాథరెడ్డి అడ్వైజరీ బోర్డు మెంబరు రామస్వామిరెడ్డి పాల్గొన్నారు. ■

# వాష్ లోన్‌తో మరుగుదొడ్డి నిర్మాణం

– వాష్ ప్రాజెక్ట్ టీమ్

మెదక్ మండలం ఔరంగాబాద్‌కు చెందిన చెప్యాల స్వాతి భర్త పేరు బాబు. వారిది నిరుపేద కుటుంబం. స్వాతి అక్షయ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉంది. ఆమె గత పది సంవత్సరాలుగా సంఘంలో ఉంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. వీరు నివసించే మురికివాడలో నీటి సమస్య ఎక్కువగా ఉండేది.



ఇంటి చుట్టు మురుగునీరు ఉండేది. కాబట్టి మరుగుదొడ్డి ఆలోచన చేయలేదు. కుటుంబ సభ్యులు కమ్యూనిటీ టాయిలెట్ వాడటం లేదా బహిరంగ మలవిసర్జనకు వెళ్లటం జరిగేది. ఇంటి చుట్టు మురుగునీరు ఉండటంవల్ల, బహిరంగ మలవిసర్జన చేయుడం వల్ల, తరచూ అనారోగ్యానికి గురై, జ్వరాల బారిన పడటం, విరేచనాలు కావడం జరిగేది.

స్వయం సహాయక సంఘం నిర్వహించే ప్రతి నెల సమావేశానికి హాజరు అయ్యేది. ఏపిమాస్ వాష్ శిక్షణలో భాగంగా వాష్ కో ఆర్డినేటర్ ఎస్ ఎల్ ఎఫ్ మీటింగుకు హాజరై నీరు, పరిశుభ్రత, పారిశుధ్యం, మరియు మరుగుదొడ్డి ఆవశ్యకత గురించి క్షుణ్ణంగా వివరించటం జరిగింది.

పారిశుధ్య లోపం వల్ల మహిళలుగా ఎదుర్కొనే వ్యక్తిగత ఆరోగ్య సమస్యల గురించి చర్చించారు. వ్యక్తిగత మరుగు దొడ్డి లేని స్వాతి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని నిర్ణయం తీసుకున్నది. కానీ మరుగుదొడ్డి వెంటనే నిర్మాణం చేసుకునే ఆర్థిక స్తోమత స్వాతికి లేదు.

వాష్ లోన్ ఏవిధంగా తీసుకోవాలో వివరించటంతో స్వాతి వాష్ లోన్ తీసుకొని మరుగుదొడ్డి నిర్మించుకొవాలని నిర్ణయించుకుంది. మహిళా సంఘ సభ్యులు కూడ స్వాతికి సహకరించి వాష్ లోన్ కోసం తీర్మానం చేసినారు.

వాష్ లోన్ మంజూరు అవ్వగానే తన ఇద్దరు ఆడపిల్లలను దృష్టిలో పెట్టుకొని, ఆరోగ్యం ముఖ్యముగా భావించిన స్వాతి మరుగుదొడ్డి నిర్మాణము చేపట్టింది.

బహిరంగ మల విసర్జనను బహిష్కరించి వారి కుటుంబం మరుగుదొడ్డి వాడుకోవడం మొదలుపెట్టింది. వాష్ లోన్ వెరిఫికేషన్‌లో భాగంగా వాష్ టీం స్వాతి ఇంటిని సందర్శించినపుడు ఆమె తన సంతోషాన్ని వాష్ టీంతో పంచుకోవడం ఆనందం కలిగించింది. ఆమెలో కలిగిన స్ఫూర్తి ఎందరికో ఆదర్శంగా నిలిచింది. వాళ్ళు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా సంతోషంగా ఉన్నారు. ■

ప్రేమించ గలిగితే ద్వేషానికి తావెక్కడిది ? ప్రేమించే మనసులో ప్రేమకు తప్ప మరి దేనికీ చోటు వుండదు

# వాష్ లోన్‌తో ఉమ్మడి బోర్ బావి

– వాష్ ప్రాజెక్ట్ టీమ్

మెదక్ పట్టణంలో నవాపేట్‌కు చెందిన వన్నె నవీన స్పందన స్లమ్ సమాఖ్యలోని దీప మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలుగా ఉంది. ఈమె భర్త పేరు రవికుమార్. నవీనకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. వీరి కుటుంబం నివసించే ప్రాంతంలో నీటి సమస్య చాలా ఎక్కువగా ఉండేది. త్రాగునీటి కోసం, గృహావసరాల కోసం వాడే నీటి కోసం వారు చాలా దూరం వెళ్లి బిందెల సహాయంతో నీళ్ళు తీసుకొచ్చి పనులు చేసుకోవడం జరిగేది.

నీటి కోసం శారీరక శ్రమ, సమయం వృధా అయ్యేది. దానితో ఉదయం నుండి రాత్రి వరకు అన్నీ పనులు ఆలస్యం అయ్యేవి. పరిశుభ్రమైన నీరు లభించేది కాదు. దీప పొదుపు సంఘం వారు ప్రతి నెల సమావేశం జరుపుకునేవారు. వాళ్ళ సమావేశానికి ఏపిమాస్ వాష్ కో–ఆర్డినేటర్ హాజరైనప్పుడు పరిశుభ్రమైన నీటి ఆవశ్యకత గురించి చర్చించడం జరిగింది.

నవీనతో పాటు దీప సంఘంలో మిగతా సభ్యులు కూడా అదే కాలనీలో నివసిస్తుండటం వల్ల వారికి కూడా ఇదే నీటి సమస్య ఉండేది. కానీ స్వంతంగా బోర్ బావి తవ్వించే స్తోమత వ్యక్తిగతంగా ఎవరికీ లేదు. అందరూ అనుకుంటే నీటి సమస్యను దూరం చేసుకోవచ్చని వివరించటం జరిగింది. తీసుకునే ఋణాల్లో కొంత కొంత మొత్తాన్ని అందరూ జమ చేసి నీటి సమస్య తీర్చుకోవడం కోసం బోర్ వేసుకోవచ్చని సూచించడం జరిగింది.

వారందరూ సమావేశంలో తీర్మానం చేసుకొని బ్యాంక్ లోన్ కొరకు ధరఖాస్తు చేయటం జరిగింది. మంజూరు అయిన లోన్ మొత్తం నుండి తలా 10 వేలు జమ వేసుకొని నీటి అవసరం తీరుటకు ఉమ్మడిగా ఒక బోర్ బావి తవ్వించారు. తద్వారా విజయవంతంగా నీటి సమస్యమ దూరం చేసుకోవడం జరిగింది. సంఘ బంధం యొక్క గొప్పతన్నాన్ని నిరూపిస్తూ మహిళలు అందరూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించగలరని దీప మహిళా సంఘం నిరూపించింది. ఇప్పుడు నవీనతో పాటు వారి సంఘంలో గల మిగతా సభ్యుల కుటుంబాలు నీటి కోసం చాలా దూరం వెళ్లాల్సిన అవసరం లేదు వారు నివసిస్తున్న చోటనే స్వచ్ఛమైన నీరు వారికి అందుబాటులో ఉంది. ఇప్పుడు వాళ్ళు తమ పనులను వేగంగా చేసుకుంటున్నారు.



వీరి లాగే మెదక్ పట్టణంలో మురికివాడలలో నివసించే చాలామంది మహిళలకు వాష్ టీం, మెప్మా సిబ్బంది సహకారంతో వాష్ అవసరాల ఆవశ్యకతను తెలియ జేసేందుకు స్లమ్ సమాఖ్య మీటింగులకు హాజరు కావటం మరియు ట్రైనింగులు నిర్వహించటం జరుగుతుంది.

తద్వారా మహిళా సంఘ సభ్యులకు స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రత, మరియు పారిశుధ్యం ఆవశ్యకత మీద అవగాహన కల్పించటం జరుగుతుంది.

వాష్ ప్రాజెక్ట్‌ను అమలు చేయటంలో పీడీ గారి నుండి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అన్ని స్థాయిలలో పని చేస్తున్న మెప్మా సిబ్బంది సహకారం మరువలేనిది. ■

కోరుకున్నట్టు జీవితం నడవకపోవచ్చు , కాని జీవించే అనుక్షణం ఉదాత్తంగా నడవగలిగితే చాలు

# రిసోర్స్ పర్సన్స్‌కు 'వాష్' కార్యక్రమాలపై శిక్షణ

– వాష్ ప్రాజెక్ట్ టీమ్

ఏపిమాస్, వాటర్ ఆర్గ్ సంయుక్తంగా అమలు చేస్తున్న నీరు, పారిశుధ్యం పరిశుభ్రత (వాష్) ప్రాజెక్ట్ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలలోని 'పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ' రిసోర్స్ పర్సన్స్‌కు, స్వయం సహాయ సంఘాల మహిళలకు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్)





కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేసి, మహిళా సంఘాల సభ్యులు తమ కుటుంబాలలో ఈ కార్యక్రమాలను అమలు పరచుకునేందుకు తగిన శిక్షణ పొందేలా ప్రోత్సహిస్తున్నది.

ముందుగా 2022 ఏప్రిల్ చివరి వారంలో సూర్యాపేట జిల్లాలో 'మెప్మా' అధికారులతో సంప్రదించి "వాష్" ప్రాముఖ్యతను, ఆవశ్యకతను సవివరంగా తెలియజేసి జిల్లాలోని మున్సిపాలిటీలలో స్వయంసహాయక సంఘాలతో పనిచేస్తున్న "రిసోర్స్ పర్సన్స్"కు మే-22 మొదటి వారంలో ఒక్కరోజు అవగాహనా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

కానీ, మున్సిపాలిటీలలో ఇతర వివిధ ప్రాముఖ్య కార్య క్రమములలో నిమగ్నమై వున్నందున రెండు నెలలు గడచి నప్పటికీ శిక్షణా కార్యక్రమం లక్ష్యం వైపు 'రిసోర్స్ పర్సన్స్' తొలి అడుగులు కూడా వేయలేదు. అయినప్పటికి మరో ప్రయత్నంగా జులై నెలలో "మెప్మా" అధికారుల సహకారంతో 'రిఫ్రెషర్ ఓరియంటేషన్' కార్యక్రమాన్ని నిర్వహించినా, ఫలితం పెద్దగాకనిపించలేదు.

మరోమారు, 'మెప్మా' అధికారులతో "వాష్" అమలు అవసరత గురించి మరియు 'రిసోర్స్ పర్సన్స్"- ఆర్.పి.ల భాగస్వామ్య ప్రాముఖ్యత / అవసరతను తెలియజేసి / చర్చించి / ఒప్పించి వారి అనుమతితో "వాష్" కార్యక్రమం స్వయం సహాయ సంఘాల సభ్యులకు చేరేలా "వాష్" ప్రచార ఉద్యమాన్ని నిర్వహించుటకు ప్రణాళికను సిద్ధం చేసుకుని ఆగష్టు మొదటివారంలో అమలు చేయడం జరిగింది.

ఈ ప్రచారోద్యమం నిర్వహించుట ద్వారా మూడు రోజులలో కోదాడ, హుజూర్ నగర్, సూర్యాపేట యు.ఎల్.బి.ల నుండి 151 వాష్ లోన్స్‌ను సమీకరించి ఆశించిన ఫలితాన్ని సాధించడంజరిగింది.

సూర్యాపేట జిల్లా 'మెప్మా' డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ (డి.ఎం.సి.) శ్రీ రమేష్ నాయక్ వివిధ స్థాయిలలోని సిబ్బందిని సమన్వయపరచి, వాష్ ప్రాజెక్ట్ తెలంగాణా మేనేజర్ శ్రీ శ్రీనివాస్ 'వాష్' కార్యక్రమాల నిర్వహణలో సమయానుకూలంగా తగు సూచనలు, సలహాలు, సహాయ సహకారాలు అందించారు. ■

**స్నేహం పేరుతో ఎన్నో ఆశించే వారు ఎందరో,కేవలం స్నేహాన్నే ఆశించే కొందరే నీ నిజమైన స్నేహితులు**

# వ్యాపారవేత్త కావడానికి కుటుంబ నేపథ్యం అడ్డంకి కాదు

– బి. వెంకన్న

**భ**ద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం సత్యనారాయణ పురం గ్రామానికి చెందిన జార హేమలతకి 2013లో భాస్కర్‌తో వివాహమైంది. భాస్కర్ లారీ డ్రైవర్. శ్రీమతి హేమలత జీవనోపాధి దినసరి కూలీ. 2015లో గోదావరి ఎస్‌హెచ్‌జిలో వి.ఓ.గా శ్రీరాంపురంలో చేరింది. ఈమెకు ఇద్దరు పిల్లలు. భాస్కర్ కుటుంబ ఖర్చుల కోసం ఇంట్లో చాలా తక్కువ మొత్తాన్నిచ్చేవాడు. కుటుంబ ఖర్చుల కోసం హేమలత వ్యవసాయ పనులకు రోజువారీ కూలీగా వెళ్లేది.

గ్రామీణ యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పాల్వంచలోని ఐటీఐ కళాశాలలో టైలరింగ్ కమ్ ఎంబ్రాయిడరీ శిక్షణకు వెళ్లింది. సాధారణ మోడల్ 'ఉషా' కుట్టు యంత్రాన్ని కొనుగోలు చేయడానికి ఆమె ఎస్‌హెచ్‌జి నుండి రుణం తీసుకుని ఇంటివద్ద బట్టలు కుట్టడం ప్రారంభించింది. ఆమె సంపాదన కుటుంబ ఖర్చులకే సరిపోవడం లేదు.

ఆమె ఎస్‌విఇపి ప్రాజెక్ట్‌లో సిఆర్‌పి–ఇపి కి ఎంపికైంది. ఎస్‌విఇపి ప్రాజెక్ట్‌లో భాగంగా ఆమె సిఆర్‌పి–ఇపి శిక్షణల మొత్తం తొమ్మిది మాడ్యూళ్లకు హాజరయింది. ఆమె భర్త భాస్కర్ జనవరి–2020లో మరణించాడు. దీంతో ఆమె కుటుంబం మరోసారి డిప్రెషన్‌లో కూరుకుపోయింది. కొంత సమయం తరువాత ఎస్‌విఇపి ప్రాజెక్ట్‌లో సిఆర్‌పి–ఇపిగా కొనసాగాలని ఏపిమాస్ మెంటార్ సూచించారు. సిఆర్‌పి–ఇపి గా ఆమెకు ఇచ్చిన క్లస్టర్‌లో 42 ఎంటర్‌ప్రైజెస్‌ని స్థాపించారు. అయితే ఆమె వ్యాపారాన్ని విస్తరించాలనే ఆలోచనలో బలంగా ఉంది. ఆమె ఇచ్చిన క్లస్టర్‌లో ఎస్‌హెచ్‌జి మరియు విఓ ఓరియంటేషన్ కోసం వెళుతున్నప్పుడు, క్లస్టర్‌లో ఎంబ్రాయిడరీకి మంచి డిమాండ్ ఉందని ఆమె కనుగొంది. ఆమె ఏపిమాస్ మెంటార్‌ని సంప్రదించి క్లస్టర్‌లో తన ఆలోచన వ్యక్తం చేసింది.

ఏపిమాస్ నుండి ప్రాజెక్ట్ మేనేజర్ మరియు మెంటార్ ఆమె ఎంటర్‌ప్రైజ్‌ని విస్తరించడానికి సూచనను అందించారు. ఆమె కంప్యూటర్ ఎంబ్రాయిడరీ డిజైన్ కోసం వ్యాపార ప్రణాళికను సిద్ధంచేసి ఏపిమాస్‌కు ఋణం కొరకు దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తును ఏపిమాస్ కమిటీ సభ్యులు పరిశీలించి, హెచ్‌ఎస్‌బిసి సిఎస్‌ఆర్ కార్యకలాపాల ద్వార 55,000/– రూపాయలు కంప్యూటర్ ఎంబ్రాయిడరీ యంత్రం కొనుగోలు



కొరకు గ్రాంట్‌గా మంజూరుచేశారు. స్త్రీనిధి నుండి ఋణం రూ. 1,00,000/– రూపాయలు తీసు కొని, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ యంత్రం కొనుగోలు చేశారు. చంద్రుగొండ మండల కేంద్రంలో అద్దెకు షాప్ తీసుకుని, వ్యాపారం ప్రారంభించారు. ప్రస్తుతం ఈమె తన షాప్‌లో మరో ఇద్దరు సభ్యులకు జీవనోపాధి కల్పించింది.

ప్రస్తుతం ఆమె నెలవారీ ఆదాయం వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| అంశం | హెచ్‌ఎస్‌బిసి సిఎస్‌ఆర్ కార్యకలాపాలకు ... | |
|---|---|---|
| | ముందు (రూ) | తర్వాత (రూ) |
| ఆదాయం | 12000/– | 25000/– |
| నికర ఆదాయం | 8500/– | 15000/– |
| జీవనోపాధి కల్పన | – | ఇద్దరికి |

ఆకాంక్ష : ఆమె బోటిక్ దుస్తులను ప్రారంభించి నెల వారీ ఆదాయం రూ.40000/– నుండి రూ.50000/– ఆదాయం విస్తరించాలని మరియు ఐదుగురు సభ్యులకు జీవనోపాధి కల్పించాలని కోరుకుంటుంది. ■

# జిహెచ్ఎంసి ఆర్పీలకు ఏపిమాస్ శిక్షణ

– జి. శ్రీనివాస్, కె.శ్రీనివాస్, యల్.భవాని





గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జి.హెచ్.ఎం.సి) పరిధిలోని 6 మునిసిపల్ జోన్లలోని రిసోర్స్ పర్సన్లకు (ఆర్పి) ఏపిమాస్ ఒకరోజు శిక్షణ యిచ్చింది. ఆ జోన్లలోని 30 సర్కిళ్ళకు చెందిన 961మంది ఆర్పీలు శిక్షణ పొందారు. ఇందుకోసం ఏపిమాస్ సంస్థ నుండి ఏపిమాస్‌కు చెందిన బ్రహ్మచారి, రాణితోపాటు జాతీయ, రాష్ట్రస్థాయికి చెందిన పదిమంది అనుభవజ్ఞులైన శిక్షకులను ఎంపిక చేశారు. సంఘాలు, సమాఖ్యల ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి, వాటిని బలోపేతం చెయ్యడం కోసం కార్యాచరణ ప్రణాళికను తయారుచేసేలా చూడడం ఈ శిక్షణల ముఖ్య ఉద్దేశం.

ఆగష్టు 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు 29 బ్యాచ్‌లుగా వివిధ మునిసిపల్ జోన్ ఆఫీసులు, ఇతర వార్డ్ ఆఫీసులలో ఈ శిక్షణ జరిగింది. అన్ని బ్యాచ్‌లలో సభ్యులు చాలా ఉత్సాహంగా శిక్షణలో పాల్గొన్నారు. జి.హెచ్.ఎంసి అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యుసిడి) విభాగానికి చెందిన ఉన్నత అధికారులు, ఏపిమాస్ సిబ్బంది ఈ శిక్షణలను పర్యవేక్షించారు.

| క్ర.స. | జోన్ పేరు | శిక్షణపొందిన ఆర్పి ల సంఖ్య |
|---|---|---|
| 1. | చార్మినార్ | 120 |
| 2. | ఖైరతాబాద్ | 95 |
| 3. | కూకట్ పల్లి | 280 |
| 4. | యల్.బి నగర్ | 170 |
| 5. | సికింద్రాబాద్ | 136 |
| 6. | షేర్ లింగంపల్లి | 160 |
| | మొత్తం | 961 |

జి.హెచ్.ఎంసి అదనపు కమిషనర్ శ్రీమతి శ్రుతి ఓఝా, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి సౌజన్య కొన్ని శిక్షణలను సందర్శించి, సభ్యులు ఏవిధంగా నేర్చుకుంటున్నారో తెలుసుకుని వారికి తగిన సూచనలు ఇచ్చారు. ఏపిమాస్ సి.ఇ.ఓ శ్రీ సి.యస్. రెడ్డి కొన్ని శిక్షణలను సందర్శించి, సంఘాలు, సమాఖ్యలను బలోపేతం చెయ్యడంలో ఆర్పీల పాత్రను వివరించి, వారిలో ఉత్సాహాన్ని నింపారు.

ఏపిమాస్ తర సీనియర్ సిబ్బంది శ్రీమతి రామలక్ష్మి, శ్రీ జి. శ్రీనివాస్, శ్రీమతి ఎల్. భవాని, శ్రీ కె. శ్రీనివాస్ అన్ని శిక్షణలను పర్యవేక్షించి, సభ్యులతో సంభాషించి, అన్ని శిక్షణలు నాణ్యతతో జరిగేటట్లు శిక్షకులకు తగిన సూచనలు యిచ్చారు. ముఖ్యంగా సహభాగ శిక్షణ పద్ధతులలో సభ్యులకు చక్కగా అర్థం అయ్యేలాగా ఈ శిక్షణలు సాగాయి.

ఏపిమాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలు జి.హెచ్.ఎం.సికు చెందిన రిసోర్స్ పర్సన్లకు ఎంతైనా

అవే అవకాశాలు ...వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకోవడానికైనా, దిగజార్చుకోవడానికైనా

# రైతు సమృద్ధి కేంద్రాల సుస్థిరతకు వ్యూహాలు

– టి.రమేష్ రెడ్డి

రైతు ఉత్పత్తిదారు సంస్థలను సుస్థిరత వైపు నడిపిస్తూ సభ్య రైతులకు కావలసిన నాణ్యమైన ఉత్పాదకాలను సముచిత ధరలకు అందించడానికి ఏపిమాస్ వివిధ రకాల వ్యూహాలను రూపొందించి మండల స్థాయి రైతు ఉత్పత్తిదారు సంస్థలలో అమలు చేస్తున్నది. ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ తమ కార్యక్రమాలను సజావుగా సాగించడానికి ఒక ముఖ్య కార్యనిర్వహణ అధికారిని నియమించుకున్నది. మరోవైపు సభ్య రైతులకు వివిధ రకాల పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగిస్తూ, వారికి కావలసిన వివిధ రకాల ఉత్పాదకాలను తెలియజేయడం కోం ఏపిమాస్ ద్వారా ఒక సాంకేతిక సమన్వయ కర్తను కూడా నియమించారు.

గత అనుభవాల ఆధారంగా రైతు ఉత్పత్తిదారు సంస్థలు నిర్వహిస్తున్న రైతు సమృద్ధి కేంద్రాల (ఎఫ్ డి సిల) సేవలను ఎక్కువమంది రైతులకు అందుబాటులోకి తేవడం కోసం ఈ క్రింది వ్యూహాలు అమలు చేయాలని ఏపిమాస్ సంకల్పించింది.

**వ్యూహాలు :**

**ప్రిస్క్రిప్షన్ వ్రాసి యివ్వడం** : సాంకేతిక అంశాలను వ్రాసియిస్తే రైతు సమృద్ధి కేంద్రం పైన, రైతు ఉత్పతిదారుల సంఘం పైన రైతులకు విశ్వాసం బలపడుతుంది.

**పాకెట్ బుక్ :** రైతు ఉత్పత్తిదారు సంస్థల ద్వారా రైతులు ఉపయోగించవలసిన ఎరువులు, పురుగు మందులు మొదలైన వాటి వివరాలతో ఒక పాకెట్ పుస్తకాన్ని అందించిన యెడల రైతులకు చాలా ఉపయోగకరంగా వుంటుంది. ఇది రైతులు తమ పొలాల్లో రసాయనాలను ఉపయోగించడంలో బాగా సహాయపడుతుంది. వీటిని ఉపయోగించడం వల్ల రైతులు పురుగు మందుల మీద అనవసరపు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు, నాణ్యమైన రసాయనాలను సరియైన సమయానికి పొందవచ్చు.

**రైతులకు చిట్కాలు :** సాంకేతిక సమన్వయకర్త గ్రామాలలో రైతులతో కలసి పని చేస్తూ యిచ్చే సలహాలు, సూచనలు తమ పంటల ఉత్పాదకత పెంచడంలో తోడ్పాటు అందిస్తాయనే భావన రైతుల మనస్సులలో కలగాలే తప్ప, రైతు సమృద్ధి కేంద్రం ఉత్పతుల అమ్మకాల కోసం యిచ్చే సూచనలు కావన్న నమ్మకాన్ని కలిగించాలి.

**బ్రాండ్ :** రైతు సమృద్ధి కేంద్రంలో జనాదరణ కలిగిన రైతులకు ఆమోదయోగ్యమైన నాణ్యమైన ఉత్పతులను అందుబాటులో ఉండేటట్లు చూడడం ద్వారా ఎఫ్ డి సి కి రైతుల రాకపోకలు పెరిగేఅవకాశం ఉన్నది.

**ఉత్పతుల జాబితా ప్రదర్శన :** రైతులు అడిగే అన్ని రకాల వస్తువుల జాబితాను రైతు సమృద్ధి కేంద్రంలో అందుబాటులో ఉంచడం ద్వారా అమ్మకాలు పెంచుకోవచ్చు.

**ఉత్పత్తుల పరిధి పెంచడం:** మన రైతు సమృద్ధి కేంద్రంలో కలుపు సంహారకాలు, పురుగుమందులు, కాంప్లెక్స్ ఎరువులు, డ్రిప్ ఎరువులు, చిన్న పనిముట్లు మొదలైన అనేక రకాల ఉత్పత్తులు, పరికరాలు అందుబాటులో వుండేలా చూసు కోవాలి. రైతులు తమకు కావలసిన అనేక రకాల ఉత్పత్తుల కోసం వస్తారు. ఇప్పుడు రైతులు పంటల అంతటా కలుపు మొక్కలతో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. రైతుల రాకపోకలను మెరుగుపరచ డానికి రైతు సమృద్ధి కేంద్రంలో కలుపు మందులను ఉంచడం చాలా కీలకం. ప్రస్తుతం ఇన్‌పుట్ వ్యాపారంలో

---

ఉపయోగకరం. ప్రస్తుత సంఘాలు, సమాఖ్యల పనితీరును ఒకసారి సింహాలోకనం చేసుకుని, వాటిని ఏవిధంగా మెరుగుపరుచుకోవాలి, బలోపేతం చేసుకోవాలి మొదలైన అంశాల గురించి వారు తెలుసుకున్నారు. ఇటువంటి శిక్షణలు తరచుగా నిర్వహించమని వారు కోరారు. జి.హెచ్.ఎం.సి అదనపు కమిషనర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈ శిక్షణల పట్ల తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ■

ప్రధాన వాటా "పురుగు మందుల"తో పాటు "కలుపు మందులు" మీద ఉంది

**సద్భావన కలిగేటట్లు చేయడం :** రైతులు రైతు సమృద్ధి కేంద్రం సందర్శించినపుడు కాని, గ్రామస్థాయిలో సమావేశం జరిగినపుడు గాని, రైతులకు కిచెన్ గార్డెన్ విత్తనాలు, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు లాంటి చిన్న చిన్న బహుమతులు యివ్వడం ద్వారా రైతు సమృద్ధి కేంద్రం పైన రైతులకు అభిమానం పెరిగేటట్లు చేయవచ్చు.

**ప్రచార సమావేశాలు :** ఇన్‌పుట్ కంపెనీల మార్కెటింగ్ సిబ్బందితో గ్రామ స్థాయిలో ప్రచార సమావేశాలు జరపడం ముఖ్యం. సాంకేతిక సమన్వయకర్తలు, కంపెనీల మార్కెటింగ్ సిబ్బందితో గ్రామస్థాయిలో సమావేశాలను నిర్వహించి రైతు సమృద్ధి కేంద్రాలను గురించి రైతులకు తెలియజేయాలి.

**కళాజాత/రోల్ ప్లే/ వీడియో ప్లే :** గ్రామస్థాయిలో కళాజాత /రోల్ ప్లే/ వీడియోప్లే వంటి అవగాహన శిబిరాలు ఏర్పాటుచేసి రైతు సమృద్ధి కేంద్రం ప్రాముఖ్యతను, లభించే ఉత్పతుల వివరాలు తెలిపి వ్యాపారం పెంచుకోవచ్చును.

**రైతులతో కొవ్వొత్తుల ర్యాలీ :** రైతు ఉత్పతిదారుల సంస్థ పనిచేసే గ్రామాల పరిధిలో రైతులతో కొవ్వొతుల ర్యాలీ నిర్వహించడం ద్వారా మన రైతు సమృద్ధి కేంద్రం ప్రాముఖ్యతను, అందులో లభించే ఉత్పతుల వివరాలను గ్రామస్థాయిలో పెంచవచ్చును.

**గ్రామాల్లో ఇంటింటి ప్రచారం :** మన రైతు ఉత్పత్తిదారుల సంస్థ పని చేసే గ్రామాల పరిధిలో నివసించే రైతుల ఇంటింటి ప్రచారం ద్వార మన రైతు సమృద్ధి కేంద్రం ప్రాముఖ్యతను, అందులో లభించే ఉత్పత్తుల పట్ల సభ్యులలో అవగాహన పెంచవచ్చును.

**సేవల ప్రత్యక్ష ప్రదర్శనలు :** మన రైతు సమృద్ధి కేంద్రంలో లభించే ఉత్పతులను గ్రామస్థాయిలో ప్రత్యక్ష ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా రైతులకు ఉత్పత్తుల పట్ల అవగాహన పెరిగి, ఆ ఉత్పతులను కొనడానికి అవకాశం ఎక్కువగా ఉంది. తద్వారా రైతు సమృద్ధి కేంద్రానికి రైతుల రాకపోకలు పెంచవచ్చును.

**గ్రామస్థాయిలో ఉత్పతుల ప్రదర్శన :** మన రైతు సమృద్ధి కేంద్రంలో లభించే ఉత్పతులను గ్రామ స్థాయిలో ప్రదర్శనకు ఉంచి, వాటి గురించి అవగాహన కల్పించడం ద్వారా ఆ ఉత్పతులను కొనడానికి అవకాశమెక్కువగా ఉంది.

**కరపత్రాల పంపిణీ :** మన రైతు ఉత్పతిదారుల సంస్థ పని చేసే గ్రామాల పరిధిలో, రైతు సమృద్ధి కేంద్రలలో లఌతించే వివిధ రకాల ఉత్పతులు, వాటి వివరాలు, ధరలు, మొదలగునవి రాసి కరపత్రాలను గ్రామస్థాయిలో పంచడం ద్వారా రైతుల్లో అవగాహన పెరిగి వ్యాపారం పెంచుకొనవచ్చును.

పైన తెలిపిన వివిధ వ్యూహాలను అమలుపరచడం ద్వారా సభ్య రైతులు రైతు ఉత్పత్తిదారు సంస్థలు చేపట్టే వివిధ రకాల కార్యక్రమాలపై అవగాహన పెరిగి వాటిని సద్వినియోగం చేసుకొనుటద్వారా రైతులకు తక్కువ ధరలకు నాణ్యమైన వస్తువులు లభ్యమవుటయే గాక రైతు ఉత్పత్తిదారు సంస్థ కూడా పది కాలాల పాటు మనగలుగుతుందని ఆశిద్దాం. ■

## కొత్త పంటల శిక్షణా కేంద్రంగా కుప్పం సిఓఇ

పాలీహౌస్ లలో కూరగాయలు, పూల సాగులో అధిక ఉత్పాదకత సాధించే లక్ష్యంతో హైబ్రిడ్ వంగడాలతో మేలైన నారుతో పాటు కట్టిన (గ్రాఫ్టెడ్) మొక్కలను కుప్పం సిఓఇలో ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గ్రాఫ్టెడ్ మొక్కలను 50% సబ్సిడీపై ఇవ్వనున్నాం. ఒక్కో రైతుకు ఒక హెక్టారుకు 15 వేల మొక్కల వరకు సబ్సిడీ ఉంటుంది. నూల్ కోల్, రెడ్ క్యాబేజి, స్క్వాల్ బెండ, జుడిని, స్వీట్ కార్న్, బేబీ కార్న్, పోల్స్ బీన్స్ వంటి పంటలను పాలీహౌస్ ప్రదర్శన క్షేత్రాల్లో సాగు చేస్తూ రైతులకు ఈ సీజన్ నుంచే శిక్షణ ఇస్తున్నాం. ఏ రాష్ట్ర రైతులైనా ఈ శిక్షణ పొందొచ్చు. బంతి విత్తనోత్పత్తిని చేపట్టబోతున్నాం.

*– ఎం. వెంకటేశ్వర్లు, అదనపు సంచాలకులు*
*(స్టేట్ ప్లానింగ్) ఏపీ ఉద్యాన శాఖ*

ప్రశాంతత మనసులో వుండాలి , చుట్టూ వుండడం కాదు

# భూసారాన్ని పెంపొందించే జీవన ఎరువులు

– లిఖితా శ్రీరాం

ప్రకృతిలో ఉన్న కొన్ని సూక్ష్మజీవులు తమ జీవన చర్యల ద్వారా స్వతంత్రంగా కానీ, మొక్కలతో కలిసి కానీ పంట మొక్కలకు కావాల్సిన పోషకాలను వాతావరణం నుంచి కానీ, నేల నుంచి కానీ గ్రహించి మొక్కకు అందిస్తాయి. ఇలా మొక్కల్లోను పోషక పదార్థాలను విడుదల చేసి పంట మొక్కలకు అందుబాటులోకి తెచ్చే జీవులను జీవన ఎరువులని అంటారు. వ్యవసాయంలో అధిక మొత్తంలో ఈ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల భూమిలోపల, ఉపరితలం పైనున్న పర్యావరణం కాలుష్యం అగుటయే గాక రైతుకు పెట్టుబడి విషయంలో అధికమైన భారం కూడా పడుతుంది. ఈ నేపథ్యంలో మన వ్యవసాయ రంగంలో సమన్వయ సమగ్ర భూసార సంరక్షణ పద్ధతి ఎంతో ముఖ్యమైనదిగా జీవన ఎరువులు భుసార అభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషిస్తుంది.

ప్రకృతిలో సమతుల్యత, వాతావరణ కాలుష్య నివారణ దృష్టిలో పెట్టుకుని నూతన వ్యవసాయ విధానంలో జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలనేది మన ముఖ్య ఉద్దేశం.

వ్యవసాయంలో సూక్ష్మ జీవుల పాత్ర చాల గొప్పది. ఎందుకంటె ఇవి నత్రజనిని స్థిరీకరిస్తాయి, పోషకాలను కరిగిస్తాయి, పంటలకు అందిస్తాయి. ఈ సూక్ష్మజీవులు సహజంగానే భూమిలో ఉంటాయి. కానీ వీటి సంఖ్య పంట పంటకు తగ్గుతూ ఉంటుంది.

ఇలా తగ్గుతున్న పోషకాలను మళ్ళీ పంటలకు అందించి, దిగుబడులను పెంచడానికి వేరు మండలం దగ్గర ఈ సూక్ష్మ జీవులను కృత్రిమంగా పెంచి ఎక్కువ సంఖ్యలోకి తెచ్చి ఆవు పేడ (ఘన పదార్థాలతో) కలిపి మరల భూమికి అందించి నప్పుడు పంటలు ఆరోగ్యంగా పండుతాయి. వీటినే జీవన ఎరువులు అంటారు.

**రెండు రకాల జీవన ఎరువులు**

1. నత్రజనిని స్థిరీకరించే సూక్ష్మజీవులు.
2. భాస్వరం ఎరువును వినియోగంలోకి తెచ్చి మొక్కకు అందించే సూక్ష్మజీవులు.

**నత్రజనిని స్థిరీకరించే రెండు రకాల సూక్ష్మజీవులు**

1. స్వతంత్రంగా నత్రజనిని స్థిరీకరించే సూక్ష్మజీవులు.
2. మొక్కతో కలిసి నత్రజనిని స్థిరీకరించే సూక్ష్మజీవులు

**స్వతంత్రంగా నత్రజనిని స్థిరీకరించే సూక్ష్మజీవులు:**

1. అజటో బ్యాక్టర్ 2. అజోస్పెరిల్లమ్

**అజటో బ్యాక్టర్:**

అజటో బ్యాక్టర్ ప్రత్తి, వరి, పొగాకు, చెరకు, జొన్న, మిరప, మొక్కజొన్న, కూరగాయలు, పండ్లు, పూలతోటలకు ఉపయోగపడుతుంది. ఎకరాకు 1 కిలో అజటోబ్యాక్టర్ ఎరువును విత్తనంతో బాటువాడాలి. నాటే ముందు మొక్క వేర్లను ఈ ద్రావణంలో ముంచి నాటాలి. దీనివలన నత్రజనిఎరువు మరియు పంట దిగుబడి వినియోగం 15 శాతం తగ్గుతుంది.

**అజోస్పెరిల్లమ్:**

ఈ ఎరువు చెమ్మగా ఉన్న పొడి రూపంలో లభిస్తుంది. ఇది ముఖ్యంగా చెరకు, వరి, రాగి, మొక్కజొన్న, పశుగ్రాసపు పంటలకు ఉపయోగపడుతుంది. ఎకరాకు 200 గ్రాముల ఎరువును 10 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల గడ్డి కలిపి పైరు వేసేముందు కలియదున్నాలి. నాటే మొక్కలకు ఎరువు ద్రావణం తయారుచేసి నారు వేళ్ళు ముంచి నాటాలి. అజోస్పెరిల్లమ్ వినియోగం ద్వారా 15 నుంచి 30 శాతం వరకు నత్రజనినిచ్చే రసాయన ఎరువులపై ఖర్చు ఆదా అవుతుంది.

**మొక్కతో కలిసి నత్రజనిని స్థిరీకరణ**

పప్పుదినుసు పంటలు, వేరుశనగ లాంటి పైర్ల మొక్కలను భూమి నుంచి లాగి చూస్తే వాటి వేర్లు మీద బుడిపెలు కనిపిస్తాయి. ఈ బుడిపెలలో రైజోబియం అనే

బ్యాక్టీరియా సూక్ష్మజీవులుగా ఉంటాయి. ఇవి మొక్కకు అందించే ఆహారం తీసుకొంటూ అందుకు ప్రతిఫలంగా వాతావరణంలో లభించే నత్రజనిని మొక్కలకు ఉపయోగపడేలా తయారుచేసి మొక్కలకు అందజేస్తాయి.

పెసర, కంది, మినుము, శనగ లాంటి పప్పుధాన్యాలకు, వేరుశనగ, సోయాచిక్కుడు లాంటి నూనెగింజల పంటలకు, చిక్కుడు లాంటి కూరగాయల పంటలకు పిల్లిపెసర, ఉలవలు, బర్సీం వంటి పశుగ్రాస పంటలకు లాభసాటిగా వాడవచ్చు. ఈ రైజోబియం బ్యాక్టీరియా ఒక పైరుకు తయారు చేసిన కల్చర్ మరో పైరుకు పనికి రాదు. 200 గ్రా. కల్చర్ ఒక ప్యాకెట్ విత్తనాలకు పట్టించడానికి సరిపోతుంది.

బెల్లం పాకం తయారు చేసి చల్లార్చి అందులో 200 గ్రాముల రైజోబియం కల్చరు వేసి విత్తనానికి పట్టించి నీడలో ఆరబెట్టి 24 గంటలలోగా విత్తుకోవాలి.

విత్తనం వేసేటప్పుడు ఆఖరి దుక్కిలో ఎకరాకు 50 కిలోల డై అమ్మోనియం ఫాస్ఫేట్ ఎరువు వేయడం వల్ల రైజోబియం సమర్థవంతంగా పని చేయడానికి దోహదపడుతుంది. రైజోబియం కల్చర్ వాడడం వల్ల 25 శాతం నత్రజనిని ఇచ్చే రసాయన ఎరువులు వాడకం తగ్గించవచ్చు.

**అజోల్లా**

రైజోబియంకు పప్పుదినుసులకు ఉన్న సంబంధమే అజోల్లా, బ్లూ గ్రీన్ ఆల్గేకు కుడా ఉంది. గాలిలోని నత్రజనిని, బొగ్గు పులుసు వాయువును (కార్బన్ డయాక్సైడ్) పోషక పదర్థాలుగా మార్చగల ఏకైక జీవులు అజోల్లా జీవన ఎరువు. దీనిని వరి పంటలో వాడడం వల్ల వరి పంట దిగుబడులు 20 శాతం వరకు పెంచవచ్చు.

మొక్కలు తయారు చేసుకున్న పదార్థాలను మైకోరైజా గ్రహించి తిరిగి మొక్కకు నేలలో ఉన్న భాస్వరాన్ని స్వీకరించి అందిస్తుంది. మైకోరైజా ఆశించిన వేర్లను మైకోరైజా వేర్లు అంటారు. మైకోరైజా అన్ని పంట మొక్కల వేర్లలో ఉంటుంది.

**పొటాషియం మొబిలైజర్స్**

ఈ జీవన ఎరువు భూమిలో మొక్కకు అందుబాటులో లేని పోటాషియంను అందుబాటులోకి తెస్తుంది.

**జింక్ సొల్యుబల్కైజర్**

కొన్ని బాసిల్లస్ రకాలను ఉపయోగించి ఈ మధ్య కాలంలో ఈ జీవన ఎరువును చాలా ప్రైవేటు సంస్థలు తయారు చేస్తున్నాయి. దీని ప్రభావం వరి, మొక్కజొన్న వంటి పంటలపై కొంత మేరకు చూడవచ్చు.

**మొక్క పెరుగుదలను పెంచే జీవన ఎరువు (పి.జి.పి.ఆర్.):**

ఈ జీవన ఎరువు ఒక మిశ్రమ సముదాయంతో కూడుకున్నది. ముఖ్యంగా బాసిల్లస్ బ్యాక్టీరియాలను, సూడోమోనాస్ బ్యాక్టీరియాలను ఒక మిశ్రమంగా తయారుచేసి పి.జి.పి.ఆర్. జీవన ఎరువు అంటారు. మొక్కకు పోషకాలు అందించుటతో పాటు ఈ జీవన ఎరువులు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. భూమిలోని మొక్కలకు, తెగుళ్ళు కలుగజేసే శిలీంధ్రాలను పెరగకుండా అరికట్టును.

**జీవన ఎరువుల వల్ల ఉపయోగాలు:**

1. జీవన ఎరువులు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. నేలలోని భాస్వరాన్ని అందుబాటులోకి తెస్తాయి.
2. హార్మోన్లు, విటమిన్లు, ఎంజైములు లభ్యమవుతాయి. ఫలితంగా మొక్క పెరుగుదల చురుకుగా ఉంటుంది.
3. నేలల నుండి సంక్రమించే తెగుళ్ళను నియంత్రిస్తాయి.
4. ఉపయోగకరమైన సూక్ష్మజీవులు గణనీయంగా పెరుగుతాయి.
5. నేల భౌతిక లక్షణాలు మెరుగుపడడం వల్ల వేర్లకు గాలి, నీరు బాగా లభ్యమవుతాయి.
6. రైతులకు ఎరువు ఖర్చు తగ్గుతుంది.
7. కాలుష్యం ఉండదు, నేలకు పంటకు ఎట్టి హాని కలుగదు.
8. నత్రజని, భాస్వరం, జీవన ఎరువులు రెండూ కలిసి వాడితే అధిక ప్రయోజనం ఉంటుంది.

**జీవన ఎరువుల వాడకంలో మెళకువలు**

1. జీవన ఎరువులు ఎండ, వేడి తగలని చల్లని నీడ ప్రదేశంలో నిల్వ చేయాలి.
2. రైతు తన పంటకు వాడే జీవన ఎరువు ఆ పంటకు

చిత్తశుద్ధి అంటే ఎవ్వరూ నిన్ను గమనించకపోయినా సరైన రీతిలో ప్రవర్తించడమే

సరైనదై వుండాలి

3. ఉపయోగించే జీవన ఎరువును, గడువు తేది లోపల మాత్రమే ఉపయోగించవలెను.
4. రసాయనములతో విత్తన శుద్ధి చేసుకొనేటప్పుడు, 24-48 గంటల వ్యవధి ఉండాలి.
5. రసాయన ఎరువులతో కలిపి జీవన ఎరువులు వాడరాదు.
6. సమర్థవంతంగా పని చేయుటకు నాణ్యతగల కల్చర్‌ను వాడుకోవాలి.
7. పైరుకు నిర్దేశించిన జీవన ఎరువును ఇవ్వాలి.
8. సేంద్రియ ఎరువుతో జీవన ఎరువు కలిపిన వెంటనే పంటకు అందించాలి.

**జీవన ఎరువులు ... రకాలు**

- నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువులు
- భాస్వరంను కరిగించి మొక్కలకందించే సూక్ష్మ జీవులు
- పొటాషియంను మొక్కలకు అందించేవి
- జింక్‌ను కరిగించే సూక్ష్మజీవులు
- సేంద్రియ పదార్థాలను విచ్ఛిన్నం చేసే సూక్ష్మజీవులు
- వేరు మండలంలో ఉండి మొక్క పెరుగుదలకు దోహదం చేసే వేరు బాక్టీరియా.

**జీవన ఎరువులను ఉపయోగించే పద్ధతులు**

ముఖ్యంగా జీవన ఎరువులను నాలుగు పద్దతులలో ఉపయోగించవచ్చు.

1.విత్తన శుద్ధి 2. నారును ముంచే పద్ధతి 3.నేల ద్వారా / భూమిలో చల్లడం 4. డ్రిప్ పద్ధతి

**తీసుకోవలసిన జాగ్రతలు:**

- ఉదయం / సాయంత్రం నీడ ఉన్న సమయంలో జీవన ఎరువులు వాడటం మంచింది.
- జీవన ఎరువులను వాడేటప్పుడు లేదా మొదటిసారిగా వినియోగించేటపుడు సంబంధిత శాస్త్రవేత్తలను గాని/ వ్యవసాయ అధికారులను గాని సంప్రదించి వారి సలహా మేరకు వాడుకోవటం మంచిది.
- భాస్వరం, పొటాష్ , జింక్ సంబంధిత జీవన ఎరువులు అన్ని రకాల పంటలలో వాడుకోవచ్చు. ■

## భూమి సంరక్షణ పై అవగాహన ర్యాలీ

– అమరేంద్ర, జిఆర్

ఏపిమాస్ , నెట్ సర్ఫ్ (ఆర్గానిక్ ఇన్‌పుట్స్) సంస్థలు కలసి 10.08.2022న 'మన భూమిని రక్షించుకొందాం' (సేవ్ సాయిల్) అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించడంకోసం 'మట్టి సంరక్షణ' ర్యాలీని వి.కోట పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుండి కేజిఎఫ్ రోడ్ – వైఎస్ఆర్ సర్కిల్ వరకు నిర్వహించడం జరిగింది.

మొదట ర్యాలీలో పాల్గొన్న 40 మంది స్కూలు పిల్లలకు భూమిని ఎందుకు రక్షించుకోవాలి, రసాయనికాలు వాడటం వలన భూమి, పర్యావరణం ఏ విధముగా కలుషితం అవుతున్నాయి, ఇందుకు కారణాలు ఏమిటి, కారకులు ఎవరు అనే అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.

| రసాయనాలవల్ల భూమిపై ప్రభావం .... | కారకం |
|---|---|
| 1. భూమి గట్టిపడుతుంది<br>2. భూమిలో సేంద్రీయ పదార్థం, కర్బనము ఆవిరి అవ్వడం, భూమిలో వీటి మోతాదు గణనీయంగా తగ్గుదల<br>3. సేంద్రీయఎరువులను జీర్ణంచేసి,మొక్కకు అందించే సూక్ష్మ జీవుల సంఖ్య తరుగుదల<br>4. గాలి, భూగర్భ నీటి కాలుష్యం | ఎక్కువ మోతాదులో రసాయన ఎరువుల వాడకం |

భూమిని ఏ విధంగా రక్షించాలి అనే అంశంపై 'రసాయన ఎరువులు వద్దు! సహజ ఎరువులు ముద్దు', 'భూమి మనుగడే ! ప్రజల మనుగడ' లాంటి నినాదాలతో (స్లోగన్స్) కూడిన ప్లకార్డులతో ప్రజలలో, ముఖ్యంగా రైతులలో ఆలోచనలను రేకెత్తించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ■

**అవకాశాలు , అదృష్టమూ సూర్యోదయం లాంటివి ; సమయానికి మేలుకోకపోతే అందకుండా పోతాయి**

# అధిక దిగుబడికి సమగ్ర సస్యరక్షణ చర్యలు

– శ్రీను (9603765843)

సమగ్ర సస్యరక్షణ అనగా పర్యావరణ సమతుల్యము దెబ్బతినకుండా పైరులపై వచ్చు వివిధ రకాల చీడపీడలను ఎప్పటికప్పుడు అంచనాలు వేసి వాటివలన పంటలకు ఏ విధమైన నష్టం వాటిల్లకుండా తక్కువ ఖర్చుతో సేద్యపద్ధతుల ద్వారా, యాంత్రిక పద్ధతుల ద్వారా, జీవ నియంత్రణ పద్దతుల ద్వారా చివరిగా సస్యరక్షణ మందులు వాడి అధిక దిగుబడులను సాధించడం.

మరొక విధంగా చెప్పాలంటే పర్యావరణాన్ని దృష్టిలో వుంచుకొని పైరులలో అధిక దిగుబడులు సాధించటలో హానికారక చీడపీడలను నష్టపరిమితి స్థాయి దాటకుండా నియంత్రిస్తూ, పైరుకు మేలుచేసే పురుగులను రక్షించు కొనుటకు అనుసరించే విధానమే సమగ్ర సస్యరక్షణ.

**సమగ్ర సస్యరక్షణ ఎందుకు?**

1. పురుగుల సహజ శత్రువులనుకాపాడేందుకు
2. క్రిమిసంహారక పురుగు మందుల వాడకాన్ని తగ్గించేందుకు.
3. పంటసాగు ఖర్చు తగ్గించేందుకు.
4. వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు
5. నాణ్యమైన ఆరోగ్యవంతమైన పంటలను పండించేందుకు.
6. చీడపీడలలో పురుగు మందులను తట్టుకునే శక్తి పెరగకుండా ఉండేందుకు.
7. పంట రకాలలో చీడపీడలకై ఉండే నిరోధక శక్తి తగ్గకుండా వుండడానికి.
8. రసాయనిక పురుగు మందులు చల్లుట వలన చనిపోగా మిగిలిపోయిన పురుగుల సంతతి వృద్ధి చెందకుండా ఉండేందుకు.
9. రసాయన మందుల వలన మనుషులకు వచ్చే క్యాన్సర్, కళ్ళ జబ్బులు, జీర్ణాశయములో వచ్చే గడ్డలు, చర్మ, గుండె సంబంధమైన రోగాలను తగ్గించడానికి.

**సమగ్ర సస్యరక్షణ ఎలా చేయాలి**

**సాగు పద్ధతులు**

- గత పంట అవశేషాలను తొలగించడం.
- వేసవిలో దుక్కి చేయడం
- విత్తన శుద్ధి చేయడం, సకాలంలో విత్తడం, సకాలంలో తీయడం
- మొక్కల సాంద్రతను తగినంతగా పాటించడం
- చీడపీడల్ని తట్టుకునే వంగడాలను సాగు చేయడం
- పోషక పదార్ధాలు తగిన మోతాదులో వాడటం
- ఎర పంటలు వేయడం

**యాంత్రిక పద్ధతులు**

- గ్రుడ్లు, లార్వా, ప్యూపాలను ఏరి నాశనం చేయాలి
- నారుమళ్ళలో వల వేసి రసం పీల్చే పురుగుల నుండి నారును కాపాడాలి
- కిరోసిన్ కలిపిన నీటిని మొక్క క్రింద వుంచి మొక్కను కదిలించడం ద్వారా పెద్ద పురుగులను తొలగించవచ్చు
- పొలం చుట్టూ కందకం త్రవ్వాలి
- అవసరాన్ని బట్టి వివిధ ఎరలను వాడాలి
- అ) దీపపు ఎర
- ఆ) సహజమైన ఎర: మొలాసిస్ చక్కెర ద్రావణం
- ఇ) పురుగులను పారద్రోలు ఎరలు : కర్పూర తైలము సిట్రోనెల్లా తైలము
- ఈ) బంక ఎరలు : బంక అంటించిన కాగితమును పొలములో వ్రేలాడదీయుట

**సహజ శత్రువుల ద్వారా నియంత్రణ**

- బదనికలు ఉదా: తూనీగలు, సాలీడు.
- పరాన్నజీవులు. ఉదా: ట్రైకోగ్రామా, బ్రాకాన్, టెట్రాస్టికస్.
- శిలీంధ్రములు ఉదా: ట్రైకోడేర్మా, ట్రైకోధీసియం, కొనియోదీరియం, స్పోరిడెస్మం, పెనిసీలియం, ఆస్పర్జిల్లస్
- ఈస్ట్: బాక్టీరియా : ఉదా: బి.టి.కె సూడోమోనస్, స్ట్రెప్టోమైనాస్, ఆక్టినోమైనస్.
- వైరస్ ఉదా : ఎన్.పి.వి

సహజ క్రిమినాశినులు : ఉదా: బీజామృతం, ఘన జీవామృతం, పొగాకు కషాయం, వేప నుండి తయారు చేయబడిన నూనెలు, వావిలాకు కాషాయం, అగ్ని అస్రం, సీతాఫల కషాయం మొదలగునవి.

**రసాయన మందుల వాడకం**

**రసాయన మందులు**

సమగ్ర సస్యరక్షణలో చివరి అంశంగా వాడబడినది. – పురుగులపై పని చేయు విధానాన్ని బట్టి పురుగు మందులను ఉదర సంబంధమైన, స్పర్శ సంబంధమైన అంతర్వాహిక మందులుగా విభజించారు.

**అంతగా కాలుష్యం చేయని చీడ పురుగులు, మందులు**

- ఎండోసల్ఫాన్
- నువాన్
- ఫాసలోన్
- డైథేన్–ఎమ్–45
- థైరమ్

**సమగ్ర సస్యరక్షణ వలన లాభాలు**

- తక్కువ ఖర్చుతో పురుగులను అదుపులో ఉంచవచ్చును.
- సహజ శత్రువులను కాపాడవచ్చును.
- వాతావరణ సమతుల్యత కాపాడవచ్చు.
- ఉత్పత్తి ఖర్చును తగ్గించవచ్చు.
- అధిక దిగుబడి పొందవచ్చు ■



## ఏపిమాస్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవం

*75 వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో ఆగస్టు 15 వ తేదీన జాతీయ పతాక ఆవిష్కరణ, 16 వ తేదీన సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఏపిమాస్ భవన పైభాగంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి జెండాను ఆవిష్కరించారు. 40 మందికి పైగా సిబ్బంది, శిక్షణ పొందడంకోసం వచ్చిన అభ్యర్థులు, యితరులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. సిబ్బందితో పాటు ఈ కార్యక్రమంలో ఏడుగురు బ్రహ్మకుమారీలు పాల్గొనడం విశేషం! ఈ బ్రహ్మకుమారీలు స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నవారికి రాఖీలు కట్టి తమ ఆత్మీయతను తెలియజేయడం మరో విశేషం!*



# 'పాడిపంటలు' ప్రాజెక్ట్‌లో విత్తన బంతుల ప్రయోగం !

– అనుష

**మా**నవ మనుగడకు నీరే ఆధారం. ఇందుకు వర్షాలు సమృద్ధిగా కురవాలి. సాధారణంగా అడవులు ఉన్న ప్రదేశాల్లోనే వానలు విస్తారంగా కురుస్తాయి. మరి అలాంటి అడవుల విస్తీర్ణం రోజురోజుకు తగ్గిపోతున్నది. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. రానురాను పచ్చదనం కరువై పోతుంది. గ్లోబల్ వార్మింగ్ పెరిగి పోతుంది. రాబోయే ఈ దుస్థితిని నివారించడానికి మనందరి తక్షణ కర్తవ్యం మొక్కలు పెంచడమే. మొక్కలు పెంచడం అంటే కేవలం ఇంట్లోనే కాదు అడవుల విస్తీర్ణం కూడా పెరగాలి. ఆ అడవులు పెరగ డానికి ఉపకరించే చక్కటి పరిష్కారం విత్తన బంతులు! వీటినే సీడ్ బాల్స్ అని ఈ ప్రక్రియను సీడ్ బాంబింగ్ అంటారు. విత్తన బంతుల తయారీ, ఈ బంతులు ఉప యోగించి సాధించిన విజయాలు గురించి తెలుసుకుందాం.

అన్నమయ్య జిల్లాలోని కురబలకోట, వాల్మీకిపురం మండలాలలో లేపిమాస్ 'పాడిపంటలు' ప్రాజెక్ట్‌లో భాగంగా విత్తన బంతలను తయారు చేయటం జరిగింది. ఈ కార్య క్రమంలో ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, ఎఫ్ పి ఓల బపాలకవర్గ సభ్యులు పాల్గొని విత్తన బంతులు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యత, ఉపయోగం గురించి వివరించటం జరిగింది.

**విత్తన బంతుల ప్రక్రియ ఏమిటంటే...**

మనుషులు అంత సులభంగా వెళ్లలేని కొండ ప్రాంతాల్లో ఎలాగోలా వెళ్లి విత్తనాలు నాటగలిగినా.. ఆ తర్వాత వాటిని సంరక్షించడం కష్టమవుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగానే ఈ 'సీడ్ బాంబింగ్' పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ప్రత్యేకంగా సంరక్షణ అవసరం లేకుండా, ప్రకృతి సిద్ధంగా త్వరగా పెరిగే చెట్ల రకాల విత్తనాలతో ఈ విత్తన బంతుల పద్ధతిని అమలు చేస్తారు. మన రాష్ట్రంలో కానుగ, వేప, అల్లనేరేడు, సీమరూప, రావి, మర్రి, నమిలినార రకాలను సీడ్ బాల్స్ పద్ధతిలో పెంచుకోవచ్చు.

అన్నమయ్య జిల్లాలోని కురబలకోట, వాల్మీకిపురం మండలాలలో పాడిపంటలు ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ రకాల విత్తనాలను భారీగా సేకరించి పాఠశాల విద్యార్థులు, ఎఫ్ పి ఓల పాలకవర్గ సభ్యులచేత దగ్గరలోని ఖాళీ ప్రాంతంలో, అటవీ ప్రాంతంలో చల్లటం జరిగింది.

**తయారుచేసే పద్ధతి**

విత్తన బంతుల తయారీ పెద్దగా కష్టమైన పనేమీ కాదు. మొదటగా సారవంతమైన ఎర్రమట్టిని తీసుకోవాలి. దీన్ని జల్లెడ పట్టుకోవాలి. దీనికి పేడ, గోమూత్రం, బెల్లం, అపరాల పిండిని డ్రమ్ములో ఆరబెట్టి తయారు చేసిన జీవామృతాన్ని, వర్మి కంపోస్టును జత చేసుకోవాలి (75 శాతం ఎర్రమట్టి, 25 శాతం పేడ ఎరువును మిశ్రమంగా చేస్తారు). ఈ మిశ్రమాన్ని మట్టి ముద్దలుగా తయారు చేసుకోవాలి. ఈ మట్టి ముద్దల మధ్యలో ఎంపిక చేసిన విత్తనాలను ఉంచి, గుండ్రని బంతులుగా తయారు చేసి ఆరబెట్టాలి. ఈ ఉండలను ఎత్తైన కొండలు, గుట్టలు, అటవీ భూభాగాల్లో విసిరేయాలి. వర్షం కురవగానే మట్టి కరిగిపోయి అందులోని విత్తనం మొలకెత్తుంది. ఇలా మొలకెత్తిన మొక్క సహజసిద్ధంగా అడవిలో పెరుగుతుంది. పదేళ్ల కాలంలో చక్కని అడవిగా రూపాంతరం చెందుతుంది.

ఈ సీడ్ బాల్స్ విధానం జపాన్‌ది. అక్కడ ప్రాచీన కాలం నుంచీ 'సుచి దాంగో' (మట్టి పిడత) పేరుతో ఈ పద్ధతిని అనుసరించేవారు. ఆధునిక కాలంలో దానికి ప్రచారం కల్పించింది మాత్రం ప్రఖ్యాత పర్యావరణవేత్త ముసనబు. ఆయన తన ప్రసిద్ధ పుస్తకం 'గడ్డిపోచతో విప్లవం'లో సేంద్రియ వ్యవసాయంతోపాటు ఈ పద్ధతి గురించీ చెప్పారు. మన దేశంలో ఈ పద్ధతిని తొలిసారి కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా కొండలపై ప్రయోగించి విజయం సాధించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కాలుష్య నియంత్రణ మండలి విశాఖ ప్రాంతంలో కొన్ని ఎన్జీఓలతో కలిసి ఇలా విత్తనాలను చల్లిస్తోంది. ■

తప్పు చేస్తానేమోననే సంకోచం సృజనశీలతకు చేటుచేస్తుంది, ధైర్యంగా ముందడుగే దానికి మందు

# అక్కడ ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తే జరిమానా !

ఎలాంటి మొహమాటాలు లేకుండా, ఊరంతా ఒకే మాటగా తీసుకున్న ఒక నిర్ణయం ఆ ఊరు ముఖచిత్రాన్నే మార్చేసింది. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దేందుకు ఊరుఊరంతా ఒక్క తాటిపై నిలిచింది. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలనే తల్లిదండ్రుల నిర్ణయంతో ఆదిలాబాద్ జిల్లాలోని ముఖరా.కె. గ్రామం అందరికీ ఆదర్శంగా నిలిచింది.

తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో (మహారాష్ట్ర సరిహద్దులో) ఉంది ముఖరా (కె) గ్రామం. ఉదయమే పంచాయితీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి, ఉప సర్పంచ్‌తో కలిసి గ్రామస్థులను పలకరిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రతీ ఇంటి ముందు ఆగి ఆడవారికి బొట్టుపెట్టి, పిల్లలకు కొత్త దుస్తులు, స్కూల్ బ్యాగ్, పుస్తకాలు ఇచ్చి "మీ బిడ్డలను మన ప్రభుత్వ బడిలోనే చదివించాలి. అన్ని వసతులు ఉన్నాయి. ప్రైవేట్ కాన్వెంట్‌ల వైపు పంపవద్దు. ఇదంతా గ్రామసభలో తీసుకున్న నిర్ణయం" అని సున్నితంగా నచ్చచెబుతున్నారు. అలా కాదని ప్రైవేట్ స్కూల్‌కి పంపితే వెయ్యి రూపాయల జరిమానా తప్పదని సుతిమెత్తగా హెచ్చరిస్తూ ఊర్లోని గడప గడపకు తిరుగుతున్నారు.

అయితే వీరు కేవలం జరిమానాలతో ఆగలేదు. శిథిలావస్థలో ఉన్న పాత పాఠశాలను అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సర్వశిక్ష అభియాన్ నిధులు సాధించి 26 లక్షల రూపాయలతో వసతులు కల్పించారు. సకలవసతులతో ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ఆధునిక వంటశాలను, ఆటస్థలాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు విద్య మీద దృష్టిపెట్టారు. ఇంగ్లీషు మీడియంలో పాఠాల కోసం ప్రత్యేకంగా ముగ్గురు టీచర్లను నియమించుకొని గ్రామ పంచాయితీ నిధుల నుండి జీతాలు ఇస్తున్నారు.

"ప్రభుత్వ బడిలో టీచర్ల కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలు వ్యయం చేస్తుంది. వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే ప్రజలకు అందుబాటులో బడి ఉండాలనే ఆలోచనతో తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నాం. ప్రైవేట్ స్కూల్‌కి ధీటుగా సకలవసతులతో ప్రభుత్వ బడిని తీర్చిదిద్దాం. ఇప్పుడు పిల్లల చదువుల్లో కూడా మార్పు వచ్చిందని తల్లిదండ్రులు సంతోషిస్తున్నారు" అన్నారు సర్పంచ్ మీనాక్షి.

పచ్చటి ప్రకృతి నడుమ ప్రభుత్వ పాఠశాలను అందంగా తీర్చిదిద్దారు. ఈ బడిలోకి అడుగుపెట్టగానే పరిసరాలు ఆహ్లాదంగా, కావాల్సినంత ఆక్సిజన్‌ను అందిస్తుంది. రంగులతో పాఠశాలను పిల్లలకు నచ్చేలా డిజైన్ చేశారు. కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా తయారుచేశారు.

"ఒకప్పుడు ఈ స్కూల్ బిల్డింగ్ బాగా లేకుండె. దాంతో అందరూ ప్రైవేట్ స్కూల్‌కి వెళ్లేవారు. మా గ్రామ సర్పంచ్, ప్రజల భాగస్వామ్యంతో ఈ బడిని ఆకర్షణీయంగా తీర్చి దిద్దారు. ఇప్పుడు విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మా శ్రమ ఫలించినందుకు సంతోషంగా ఉంది" అంటారు హెడ్మాస్టర్ సురేఖ. పీజీ చేసినా ఉద్యోగం లేక వ్యవసాయ పనులు చేసుకుంటున్న నిరుద్యోగి ప్రమోద్‌తో పాటు మరో ఇద్దరికి ఇక్కడ విద్యా వాలంటీర్లుగా ఉపాధి లభించింది.

విద్యావికాసమే కాక, స్వచ్ఛ పల్లెగా తీర్చిదిద్దడానికి ముఖరా (కె) గ్రామస్థులు ఐకమత్యంగా కృషి చేస్తున్నారు. గ్రామంలో 300 గడపలు, 700 మంది జనాభా ఉంది. గ్రామంలో ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి, ఇంకుడు గుంత కనిపిస్తాయి.

తడిచెత్త, పొడి చెత్త సేకరణ ద్వారా సేంద్రియ ఎరువు తయారీ యూనిట్ పెట్టారు. ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తింపు పొంది, జాతీయస్థాయికి ఎంపికైన ఏకైక పంచాయతీ ఇదే.

ప్రభుత్వ పథకాలను వందశాతం ఉపయోగించుకుంటూ ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడి ప్రకృతి వనంలో నర్సరీ, సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం, మియావాకీ విధానంలో దట్టమైన అడవిని సృష్టించారు. ముఖరా గ్రామస్థుల్లాగా అందరూ ఆలోచిస్తే గ్రామాలు నందనవనాలే కదా! ■

పుట్టిన రోజు గొప్పదే, కాని ఎందుకు పుట్టామో తెలుసుకోగలిగితే ఆరోజు అంతకంటె గొప్పది

# దానిమ్మలో చీడలు, తెగుళ్ళు ... సమగ్ర సస్యరక్షణ

– అనుష

**దా**నిమ్మ పండు చాలా పుష్టికరమైనదే కాక సేద తీర్చే లక్షణం కూడా కల్గి ఉంటుంది. ఈ పండ్ల తొక్కలు, రసం, ఆకులు, వేర్లను అనేక రకాలైన ఆయుర్వేద మందుల తయారీకి ఉపయోగిస్తారు. ఈ పంటను మెట్ట ప్రాంతాల్లో విజయ వంతంగా సాగు చేయవచ్చు. భారతదేశంలో దానిమ్మ పంట ఉత్పత్తిలో మహారాష్ట్ర మొదటి స్థానం ఆక్రమించింది. తెలంగాణలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 5000 హెక్టార్లలో , ఆంధ్రప్రదేశ్‌లో అనంతపూర్ జిల్లాలో 1400 హెక్టార్లలో దానిమ్మను సాగుచేస్తున్నారు. ఈ తోటలను వివిధ రకాల పురుగులు ఆశించి నష్టాన్ని కలిగిస్తున్నాయి. తగిన సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టడం వలన అధిక దిగుబడులు పొందవచ్చు.

**దానిమ్మను ఆశించే చీడ పీడలు:**

**కాయతొలుచు పురుగు**

ఈ పురుగు మొక్కలకు వ్యాపించటం వల్ల పండ్లకు ఎక్కువ నష్టం కలుగుతుంది. ఒక్కొక్కసారి వీటి నష్టం 50 శాతం కుడా ఉంటుంది. గొంగళి పురుగులు ముదురు గోధుమ రంగు కలిగి నూగుతో కప్పబడి ఉంటాయి. గొంగళి పురుగులు పండ్లలోనికి చేరి విత్తనాలు , గుజ్జు తిని నాశనం చేస్తాయి. ఈ పురుగు ఆశించిన పండ్లు కుళ్ళి రాలిపోతాయి. దీని నివారణకు ...

- తోటలలో కలుపు మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఈ పురుగు ఆశించిన పండ్లను ఏరి నాశనం చేయాలి.
- పండ్లను పాలిథీన్ సంచులలో కప్పి ఉంచాలి.
- పూత దశలో వేప గింజల కషాయాన్ని 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పూత , పిందె దశలో మలాథియాన్ లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి

**పండ్ల రసం పీల్చే రెక్కల పురుగులు:**

పక్వానికి వచ్చిన పండ్లను ఎక్కువగా ఈ రెక్కల పురుగులు ఆశించి రాత్రి సమయంలో కాయలపై కాటు వేసి రసాన్ని పీల్చడం ద్వారా తోటలకు వివరీతంగా నష్టం కలుగజేస్తాయి. ఈ పురుగు ఆశించిన వండ్లు కుళ్ళి రాలిపోతాయి. ఈ పురుగు కాటు వేసిన రంధ్రం చుట్టూ కాయ మెత్తబడి పోతుంది. దీని ద్వారా శిలీంధ్రాలు, బాక్టీరియాలు ప్రవేశించి కాయ పూర్తిగా కుళ్ళిపోతుంది.



**నివారణకు ...**

- తోట చుట్టూ ఉన్న ఆముదం, తిప్ప తీగల పొదలను కొట్టి వేయాలి.
- చెట్ల కింద రాలిపడిన, కుళ్ళిన కాయలను ఏరివేయాలి.
- పండ్లు పక్వానికి వచ్చిన తరువాత వీలైనంత త్వరగా కోసి మార్కెటింగ్ చేసుకోవాలి.
- పండ్ల పక్వదశలో రాత్రిపూట పొలంలో లైట్లు పెట్టి పళ్ళాలలో మలాథియాన్ 2 మిలీ, 20గ్రా పంచదార 1 లీ పండ్ల రసంతో కలిపిన విషపు ఎరను తయారు చేసి ఉంచాలి. రెక్కల పురుగులు వెలుతురుకు ఆకర్షింప బడి ఈ విషపు మిశ్రమాన్ని పీల్చి చనిపోతాయి.
- పొలంలో సాయంత్రం వేళ 7–9 గంటల సమయంలో చెట్లకింద అక్కడక్కడ పొగ పెట్టడం ద్వారా కూడా పురుగులను అరికట్టవచ్చు.

భయంతో ఎక్కడికని పారిపోతావ్ ? ఆ భయం వున్నదే నీ గుండెలో

- కాయలకు పేపర్ సంచులను కట్టడం ద్వారా చిలకల బారి నుండి కాయలను కాపాడుకోవచ్చు.
- కాయ పక్వానికి వచ్చే రెండు నెలల ముందు నుండే డైక్లోరోవాస్ 1 మి.లీ. 5 శాతం వేప గింజల కషాయం లేదా వేపనూనె 5 మి.లీ. కలిపి 15-20 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి పిచికారి చేయాలి.

**తామర పురుగు**

ఈ పురుగులు ఎక్కువగా ఆకులను, లేత కాయలను ఆశిస్తాయి. ఇవి ఆశించటం వల్ల ఆకుల చివర్ల భాగాలు వంకర తిరిగి ఎండిపోతాయి. ఇక కాయల మీద గరుకు మచ్చలు ఏర్పడతాయి. మొక్క మొగ్గలు తొడిగిన దశలో 2 మిలి. డైమిథో యేట్ లేదా పిప్రొనిల్‌ను లీటర్‌నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా వీటిని నివారించవచ్చు.

**పేనుబంక**

ఇది మొక్క లేతగా వున్నప్పుడు లేత కొమ్మలకు, చిగురు ఆకులకు సోకుతుంది. ఈ పురుగులు పూలకు సోకి రసాన్ని పీల్చడంతో మొక్కకు నష్టం కలుగుతుంది. ఇవి ఆకులపై వ్యాప్తి చెందటం వల్ల ఆకుల చివర్లో వంకర్లు తిరిగి ఎండి పోతాయి.

**పిండి పురుగు**

ఈ పురుగులు పూత, కాయల నుండి రసాన్ని పీల్చడం వలన పక్వానికి రాకముందే పిందెలు రాలిపోతాయి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే చెట్లు పూర్తిగా ఎండిపోతాయి. వీటి నివారణకు పురుగు బాగా ఆశించిన భాగాలను తీసి నాశనం చేయాలి. ఫాసలోన్ 1.5 మి.లీ. వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. క్రిప్టోలీమస్ మాన్జరీ బదనికలను చెట్టుకు 10 చొప్పున విడుదల చేయాలి.

**దానిమ్మలో తెగుళ్ళు:**

**బ్యాక్టీరియా మచ్చ తెగుళ్ళు**

ఈ తెగుళ్ళు వ్యాపించటం వల్ల ఎక్కువ నష్టం కలుగు తుంది. వీటి నివారణకు ఎన్ని మందులు వాడినా ఈ తెగుళ్ళను అరికట్టలేక తోటనే తొలగిస్తున్నారు. వీటికి సమగ్ర నివారణ చర్యలు రైతాంగం సామూహికంగా పాటిస్తే వీటిని అదుపులో ఉంచవచ్చు.

**రోగ లక్షణాలు**

ఈ బ్యాక్టీరియా ఆకులను, కొమ్మలను, కాండాన్ని, పండ్లను ఆశిస్తుంది. అక్కడక్కడ నీటిలో తడిసిన చిన్న చిన్న మచ్చలు ఏర్పడుతాయి. ఆ మచ్చల చుట్టూ పసుపు రంగు వలయం ఏర్పడుతుంది. ఈ మచ్చలు ఒకదానితో ఒకటి కలిసి పెద్దగా మారటం వలన ఆకు రాలిపోతుంది. నీటిలో తడసిన మచ్చలు, కొమ్మలపై, కాయలపై, కాండంపై గమనించవచ్చు. కొమ్మలపై తెగులు సోకిన భాగంలో కణజాలం కుళ్ళి రాలిపోతుంది.

**నివారణ చర్యలు:**

1. బ్యాక్టీరియాను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి.
2. పూత దశలో 3 గ్రా. మాంకొజేబ్ పిచికారి చేయాలి.
3. 3 గ్రా కాపర్ ఆక్సిక్లోరైడ్ పిచికారి చేయాలి
4. పాదులో కలుపును నియంత్రించుకోవాలి,

**సిలీంధ్ర మచ్చ తెగులు**

ఈ తెగులు రెండు లేదా మూడు శిలీంధ్రాల వల్ల సోకుతుంది. మచ్చలు ఆశించే సిలీంధ్రాలు వివిధ ఆకృతులలో ఉంటాయి. ఇవి ఎక్కువగా ఆకులపైన, కాయలపైన వ్యాపించి వాటిపైన మచ్చలు ఏర్పరుస్తాయి. ఈ మచ్చలు ఒకదానితో ఒకటి కలసిపోయి పెద్ద మచ్చగా ఏర్పడతాయి. ఈ మచ్చల వలన ఆకులు రాలిపోయి, కాయ కుళ్ళి నాణ్యత కోల్పోతుంది.

నివారణ చర్యలు : పూత, పిందె దశలో 2.5 గ్రా కాపర్ క్లోరైడ్ లేదా కార్బండజియం లీటర్ల నీటిలో కలిపి ప్రతి 15 నుండి 20 రోజుల వ్యవధిలో రెండు లేదా మూడుసార్లు పిచికారీ చేయాలి.

**ఎండు తెగులు :** ఈ తెగులు సోకడం వలన చెట్లు పాక్షికంగా లేదా సంపూర్ణంగా ఎండిపోతాయి. నేల నుండి వ్యాపించే సిలీంధ్రం వలన తెగులు ఏర్పడుతుంది.

నివారణ చర్యలు: చెట్టు పాదుల్లో రెండు మిల్లీలీటర్ల ప్రోపికన జోన్ లేదా 4 గ్రా ట్రైకోడ్డర్మవెరిడీ లేదా 3 గ్రా కార్బండ జియం ఒక లీటర్ నీటికి కలిపి చెట్టు పాదుల్లో పోయాలి. ■

**నిన్ను పదేపదే వేధించే వారివల్ల నీ ఆత్మబలం పెరుగుతున్నట్టు, వారి బలం క్షీణిస్తున్నట్టు**

# అనేక విషయాలను నేర్పిన 'ఆదరణ' పర్యటన !

– రాజశేఖర్ కె. (ప్రాజెక్టు ఆఫీసర్, ఏపిమాస్)

క్లైమేట్ స్మార్ట్ అగ్రికల్చర్, న్యూట్రిషన్ , కిచెన్ గార్డెన్‌పై శిక్షణలో భాగంగా ఏపిమాస్, స్నేహ కుంజ సిబ్బంది కలసి 'ఆదరణ' అగ్రికల్చరల్ పాలిటెక్నిక్‌ని సందర్శించారు. హీఫర్ ఇంటర్నేషనల్ ఆర్థిక సహకారంతో, ఈ కార్యక్రమం 2022 ఆగస్ట్ 11న నిర్వహించడం జరిగింది.



ఆదరణకు ఉదయం 9 గంటల 45 నిమిషాలకు చేరుకున్నాం. అక్కడ ఆదరణ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీ రామకృష్ణను కలుసుకున్నాం. రామకృష్ణ గారి ద్వారా ప్రకృతి వ్యవసాయం ఏ విధంగా చేస్తారో, అక్కడ వారు పాటిస్తున్న పద్ధతులు ఏమిటో తెలుసుకున్నాం. ఆదరణ ఫౌండేషన్ 135 ఎకరాలలో విస్తరించి ఉందని తెలిపారు.

**ఎద్దు కట్టెగానుగ కేంద్రం**

తర్వాత ఎద్దుల గానుగలో వేరుశనగ నూనెను తయారు చేసే కేంద్రాన్ని సందర్శించాము. అక్కడ 13 కేజీలు వేరుశనగ విత్తనాలు వేసినట్లయితే ఐదు నుండి ఐదున్నర కేజీలు నూనె లభిస్తుందని తెలుసుకున్నాము. నూనె తీసినటువంటి చెక్క అక్కడ ఉన్నటువంటి పశువులకు మేతగా వినియోగిస్తారని తెలిపారు. ఇక్కడ తీసినటువంటి స్వచ్ఛమైనటువంటి వేరుశనగ నూనె కేజీ 350 రూపాయలకు విక్రయిస్తారట.

**పంటలను వాటి తెగుళ్లను పరీక్షించడం**

అక్కడ పండిస్తున్న మిరప, టమాట , బెండ పంటలను చూశాం. వీటిని పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. వీటికి కూడా కషాయాలు, పుల్లటి మజ్జిగ స్ప్రే చేయడం వలన వ్యాధి నివారణ చర్యలు చేపడుతున్నారని తెలుసుకున్నాము. బెండకు కాయ తొలుచు పురుగు , వంకర కాయలు రావడం ఎక్కువగా ఉంటుందని ఏపిమాస్‌కు చెందిన శ్రీనివాస్ గారు తెలియజేశారు. కోత దశలో కాకుండా ముందుగానే వ్యాధిని గుర్తించి జీవామృతం కషాయాలను స్ప్రే చేయాలని సూచించారు.

**పశు సంపద మరియు ఘన జీవామృతం తయారీ విధానం**

అక్కడ ఉన్నటువంటి పశువులను వాటి రకాలను అడిగి తెలుసుకున్నాము. ఇక్కడ సుమారు 100 పశువులు ఉన్నట్లు తెలుసుకున్నాను. ఇందులో జెర్సీ, ఒంగోలు, గీర్, జాతులు, దేశవాళీ ఆవులు వున్నట్లు తెలిపారు. రోజూ సుమారు 70 లీటర్ల పాలు అమ్ముతున్నట్లు చెప్పారు. ఆవుల నుండి వచ్చు గంజును (మూత్రాన్ని) అంతటిని ఒక పెద్ద తొట్టెలోకి పంపుతారు. ఇందులో 20 వేల లీటర్ల గంజును నిలువ చేసి ఫిల్టర్ ద్వారా నేరుగా నీటి పంపులకు అనుసంధానం చేసి , వాటి నుండి మొక్కలకు సరఫరా చేస్తారని, దానిని బిందు సేద్యానికి ఉపయోగిస్తారని తెలిపారు.

ఆవు పేడను ఘనజీవామృతంగా చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నాము. 10 కేజీల ఆవు పేడ, ఐదు లీటర్ల ఆవు గంజు, ఒక కేజీ శనగపిండి, పిడికెడు పుట్టమన్ను, ఒక కేజీ



చుట్టూ చూడగలిగినవారు కలలు కంటారు , తమ గుండె లోతులు చూడగలిగినవారు మేల్కొంటారు



బెల్లం అవసరమని వీటన్నిటినీ కలిపి ముద్దలుగా తయారు చేసుకొని నీడలో ఆరబెట్టుకోవాలని 15 రోజుల తర్వాత వాటిని దుక్కిలో వేసుకోవాలని తెలియజేశారు.

**గ్రేడింగ్, ప్రాసెసింగ్ పద్ధతులు**

ఆధునిక పద్ధతిలో వేరుశనగ గ్రేడింగ్‌చేసే యంత్రాన్ని చూశాం. అక్కడే వేరుశనగకాయలతోపాటు కొర్రలు, సాములు, అరికెలు గ్రేడింగ్ చేసే మిషన్స్‌ను కూడా చూశాం.



ఇక్కడ తయారు చేసినటువంటి ఉత్పత్తులను వారే ప్యాకింగ్ చేసి, మార్కెటింగ్ చేస్తారని వివరించారు.

లెమన్ టీ మొక్కల పెంపక క్షేత్రాన్ని సందర్శించాము. వీటి ఆకులను నీటిలో మరిగించి త్రాగితే ఆరోగ్యం మెరుగుపడుతుందని చెబుతారు.

**నీటి నిర్వహణ**

నీటి నిర్వహణ కింద చుట్టుపక్కల 400 ఎకరాలలో వచ్చే వర్షపు నీటిని పెద్ద పైపుల ద్వారా ఒక పెద్ద బావిలోకి మళ్ళిస్తారు. ఈ బావిలో ఏ కాలమైనా నీరు ఇంకిపోవట! ఈ బావి నుండి పంపింగ్ సిస్టం ద్వారా పెద్ద సంపుకు, అక్కడినుండి పైపుల ద్వారా పంటలకు పంపిస్తామని తెలియజేశారు. మొత్తం 18 బోర్ బావులు ఉన్నట్లు తెలిపారు. సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అన్ని బోర్లలో నిరంతరం నీరు పుష్కలంగా లభిసున్నట్టు తెలియజేశారు.

**రామకృష్ణతో సంభాషణ**

ఆదరణ ఎం.డి. శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని మంచి పౌష్టికాహారాన్ని అందించే దిశగా ఈ ఆదరణ ఫౌండేషన్ కృషి చేస్తున్నదని మిగిలిన వారు కూడా ఇలాంటి పద్ధతులను పాటించి, పర్యావరణాన్ని భూసారాన్ని సంరక్షించి, ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఎవరికైనా ప్రకృతి వ్యవసాయాన్ని గురించి ఎటువంటి సందేహాలు, సమస్యలు ఉన్నా వాటికి పరిష్కార మార్గాలను తెలియజేస్తామని శ్రీ రామకృష్ణ తెలియజేశారు.

యువత వ్యవసాయం పట్ల ఆసక్తి చూపి ప్రకృతి వ్యవసాయం చేయాలని, వ్యవసాయాన్ని సుస్థిరంగా, సహజంగా చేయాలని, అకర్బన పదార్థాలనుపయోగించడం మానుకోవాలని శ్రీ రామకృష్ణ మార్గదర్శనం చేశారు. జంతువుల, మొక్కల (పాడి పంటలు) మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమని దీర్ఘకాలంలో, వ్యవసాయం ఏ రైతుకు భారం కాకుండా ఉండాలని ఆయన అభిలషించారు. మొక్కలకు అవసరమైన పర్యావరణ పరిస్థితులను అర్థం చేసుకుని, సహజ వ్యవసాయం సాగించాలని ఆయన కోరారు.



■

## ఏపిమాస్ కార్యక్షేత్రాలలో 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవ సంబరాలు ... మరికొన్ని దృశ్యాలు



హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయం, గుడిబండ, నల్లమాడ



పామిడి, వాల్మీకిపురం, జి ఎం ఎం-ధీశాలి




కురబలకోట, పెద్దవడుగూరు, బోరపట్ల, తాడిపత్రి

ఎన్ ఎం డి సి హెచ్ ఎం 2022 మారథాన్‌లో పాల్గొన్న శ్రీ సి ఎస్ రెడ్డి బృందం



ఒకరిని అంచనావేయడం వల్ల వారెలాంటివారో తెలిసే కన్న నీవెలాంటివాడివో తెలుస్తుంది.


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
నీళ్ళ ట్యాంకు మరియు రెండు గుంతల మరుగుదొడ్డి
దీర్ఘ కాలం అందించెను మీకు సేవలు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

MAHILA SADHIKARATHA
Publication Date: 01-09-2022 ; Posting Date: 05 & 06-09-2022

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23







దక్షిణాది సహకార సంస్థల పరిస్థితి పై చర్చాగోష్టి . . . మరికొన్ని దృశ్యాలు











టి ఆర్ పి సి రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ప్రతినిధులు ... వి కోటలో మట్టి సంరక్షణ ర్యాలీ ... అయ్యవారిపల్లెలో శ్రీ సి ఎస్ రెడ్డి చే కూరగాయల విత్తనాల కిట్ల పంపిణీ

## ఏపిమాస్ మార్గదర్శకత్వంలోని ఎఫ్ పి ఓ ల వార్షిక మహాసభల జోరు !





కామధేను ఎఫ్ పి ఓ ... పెదమండ్యం .... పామిడి ఎఫ్ పి ఓ






కురబలకోట .... తంబళ్ళపల్లి

To ADDRESS




కలికిరి

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089